

వైకాపా హయాంలో ఉత్తర్వులతో సరి


రెండు జలాశయాలతో.. కుప్పం కరవుకు చెక్!

కూటమి ప్రభుత్వం పూర్తి చేస్తే రైతాంగానికి మేలు

ఈనాడు, చిత్తూరు: కుప్పం నియోజకవర్గం.. కరవుకు చిరునామా. అటువంటి ప్రాంతానికి రెండున్నర దశాబ్దాల క్రితమే రాష్ట్రంలోనే తొలిసారి ఇజ్రాయెల్ సహకారంతో బిందుసేద్యం ప్రాజెక్టును పరిచయం చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు. దశాబ్దం క్రితం హంద్రీ-నీవా సుజల స్రవంతి (హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్) ప్రాజెక్టును కుప్పం వరకూ పొడిగించారు. రూ.430.26 కోట్లతో ప్రత్యేకంగా ఉప కాలువ నిర్మాణానికి పరిపాలనా అనుమతులు ఇచ్చి నిర్మాణం పూర్తి చేశారు. వచ్చే సీజన్ నాటికి పూర్తిస్థాయిలో కుప్పానికి నీళ్లు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇదేక్రమంలో వైకాపా హయాంలో మంజూరై టెండర్ ప్రక్రియ కూడా పూర్తి కాని రెండు రిజర్వాయర్ల పనులు ప్రారంభిస్తే రైతాంగానికి ఎంతో మేలు జరుగుతుంది. పరిశ్రమలకూ నీరు అందించవచ్చు.

5 వేల ఎకరాలకు నీరు

కుప్పాన్ని తన సొంత నియోజకవర్గం పులివెందులలా చూస్తానని అప్పటి ముఖ్యమంత్రి జగన్ చెప్పుకొచ్చారు. 2022 సెప్టెంబరు 23న కుప్పానికి వచ్చినప్పుడు గుడుపల్లె మండలం యామగానిపల్లె, శాంతిపురం మండలం మాదనపల్లి వద్ద రిజర్వాయర్లు నిర్మిస్తానని హామీ ఇచ్చారు. రూ.250 కోట్ల వ్యయమవుతుందని పేర్కొన్నారు. అనంతరం వీటి గురించి జగన్, ఆయన ప్రభుత్వం పట్టించుకోలేదు. ఎన్నికల నియమావళికి 20 రోజుల ముందు యామగానిపల్లెలో 0.710 టీఎంసీలు, మాదనపల్లిలో 0.354 టీఎంసీల సామర్థ్యంతో రెండు జలాశయాలకు పాలనా అనుమతులు ఇచ్చారు. ఒక్కో రిజర్వాయర్ కింద 2,500 ఎకరాలకు నీరందుతుందని.. మొత్తంగా 5వేల ఎకరాల నూతన ఆయకట్టు సస్యశ్యామలమవుతుందని పేర్కొన్నారు. రూ.535.435 కోట్లతో పనులకు ఆమోదం తెలిపారు.



యామగానిపల్లెలోని చెరువు

పరిశ్రమల అవసరాలకు..

శ్రీశైలం జలాశయం నుంచి వచ్చే కృష్ణా జలాలతో 1.06 టీఎంసీల సామర్థ్యమున్న ఈ రెండు జలాశయాలు నింపాలన్నది అధికారుల ఆలోచన. ఇందులో 0.3 టీఎంసీలను పరిశ్రమల అవసరాలకు వినియోగించుకోవాలని నిర్ణయించారు. ప్రస్తుతం కుప్పం పారిశ్రామిక ప్రగతే ధ్యేయంగా వేగంగా భూసేకరణ చేస్తున్నారు. అవసరమైన పెట్టుబడులు తీసుకువచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక చొరవ చూపనున్నారు. ఇవి సాకారం కావాలంటే నీరు ఎంతో కీలకం. ఇప్పటికే రిజర్వాయర్ల నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్లాలని ఎన్డీయే సర్కార్ సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఈనేపథ్యంలో కీలకమైన టెండర్ల ప్రక్రియ చేపట్టాలని హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ అధికారులను ఆదేశిస్తే అనతికాలంలోనే రైతాంగానికి, పరిశ్రమలకు నీరు లభిస్తుంది.

121.పెద్దూరులో కడితే బాగుంటుందని..

శాంతిపురం మండలం మాదనపల్లిలో నిర్మించే జలాశయం దిగువ ప్రాంతంలో ఉంది. పూర్తిస్థాయిలో నిండిన తర్వాత జలాలు పాలారులోకి వెళతాయి. అదే ఎగువన ఉన్న 121.పెద్దూరులో కడితే అన్నింటికీ అనుకూలంగా ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పరిశ్రమలకు సైతం సులభంగా నీరు ఇవ్వవచ్చని అంటున్నారు. మరోసారి సర్వే చేసి ఏ ప్రాంతమైతే ఎక్కువగా ఉపయుక్తంగా ఉంటుందో తేల్చి అక్కడ జలాశయం నిర్మించాలని కోరుతున్నారు.

ఇది ఇంతే.. వాడరంతే..!



గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసర వైద్యసేవలు అందించాలంటే సమయానికి అంబులెన్స్ అందుబాటులో లేకుంటే రోగిని ఆసుపత్రికి తరలించేందుకు ఉపయోగపడేలా రూపొందించిన మోటర్ బైక్ అంబులెన్స్ ఇది. రెండున్నరేళ్ల క్రితం శ్రీసిటీలోని హీరో కంపెనీ ఈ అత్యవసర బైక్ అంబులెన్స్‌ను స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి ఉచితంగా అందజేసింది. అప్పటి నుంచి దీన్ని అలంకార ప్రాయంగా ఆసుపత్రిలో మెట్ల కింద నిరుపయోగంగా పడేశారు. రవాణా సౌకర్యం లేని మారుమూల ప్రాంతాల్లో దీని అవసరం ఉంటుంది. అధికారులు ఇలా మూలన పడేస్తే.. భవిష్యత్తులో సాయం చేసేందుకు దాతలు ముందుకు రాకపోగా రోగుల ఇబ్బందులు తీర్చే నాథుడే ఉండడు.


– న్యూస్‌టుడే, నగరి

నూతన డీఆర్వోగా మోహన్‌కుమార్

నగరి, పలమనేరు ఆర్డీవోలు జీఏడీకి



మోహన్‌కుమార్



భవానిశంకరి

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: విశాఖ డీఆర్వోగా ఉన్న మోహన్‌కుమార్‌ను బదిలీపై చిత్తూరు జిల్లా రెవెన్యూ అధికారిగా నియమించారు. జిల్లా ఫారెస్టు సెటిల్‌మెంట్ అధికారి భవానిని పలమనేరు ఆర్డీవోగా నియమించారు. తాడేపల్లిగూడెం ఆర్డీవో భవాని శంకరిని.. నగరి ఆర్డీవోగా బదిలీ చేశారు. ప్రస్తుత డీఆర్వో పుల్లయ్య, పలమనేరు, నగరి ఆర్డీవోలు వెంకటేష్, వెంటకరెడ్డిని జీఏడీలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

డీఈవోగా వరలక్ష్మి



చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: జిల్లా విద్యాశాఖాధికారిగా.. అనంతపురం డీఈవో వరలక్ష్మిని నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె గతంలో స్థానిక డీఈవో కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ ఏడీగా ఉద్యోగోన్నతిపై కడప వెళ్లారు. అక్కడి నుంచి డీఈవోగా ఉద్యోగోన్నతి పొంది అనంతపురానికి బదిలీపై వెళ్లారు. తాజాగా ఇక్కడకు వస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న దేవరాజును పాఠశాల విద్యాశాఖ రాష్ట్ర కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. వరలక్ష్మి రెండు మూడ్రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

వైకాపా పాపం.. ప్రభుత్వ బడులకు శాపం

- ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆందోళనలకూ చలించని వైనం
- ఫలితంగా ప్రవేశాలు తగ్గుముఖం




ఈనాడు, చిత్తూరు: 'ప్రైవేటు పాఠశాలలతో పోలిస్తే ప్రభుత్వ బడుల్లో ప్రవేశాలు పది శాతం తక్కువగా ఉంటున్నాయి.. మొత్తం విద్యార్థుల్లో 45 శాతం మంది మాత్రమే ఇక్కడ చదువుతున్నారు.. హాజరు కూడా 70 శాతమే ఉంటోంది' అని పూతలపట్టు మండలం ఆకనంబట్టులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆకస్మిక తనిఖీల సందర్భంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆవేదన ఇది. దీనంతటికీ వైకాపా హయాంలో తెచ్చిన సంస్కరణలే కారణమని చెప్పవచ్చు. గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం తలాతోకా లేని సంస్కరణలు తీసుకురావడం.. అవి వికటించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు పెద్దగా ప్రభుత్వ బడుల్లో పిల్లలను చేర్చేందుకు ఆసక్తి చూపలేదన్నది స్పష్టం. ఆ ప్రభావంతోనే ఈ విద్యా సంవత్సరంలోనూ ప్రవేశాల జోరు తగ్గింది. జగన్ పాలనలో జరిగిన తప్పిదాలను కూటమి పాలనలోనైనా సరిదిద్దితే సర్కార్ బడులకు మహర్దశ వస్తుంది.

విలీన ప్రక్రియతో దూరం పెరిగి..

జాతీయ నూతన విద్యా విధానంలో భాగంగా పాఠశాలల విలీనం చేపడుతున్నామని గత వైకాపా ప్రభుత్వం ప్రకటించింది. ఉపాధ్యాయులు, బడుల సంఖ్యను తగ్గించేందుకు గత పాలకులు 3, 4, 5 తరగతులను ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. దీంతో ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులు కిలోమీటరు దూరంలోని బడులకు వెళ్లాల్సి వచ్చింది. ఈ సంస్కరణలను నిరసిస్తూ తల్లిదండ్రులు, చిన్నారులు రోడ్డెక్కినా జగన్ ప్రభుత్వం మాత్రం స్పందించలేదు. పాలసముద్రం, గంగవరం, బైరెడ్డిపల్లె, కుప్పం తదితర మండలాల్లో వారం- 10 రోజులపాటు ఆందోళనలు చేసినా నాటి పాలకులు ఒక్క మెట్టు కూడా దిగిరాలేదు. అనివార్య పరిస్థితుల్లో తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల్లో చేర్చేందుకు మొగ్గు చూపారు. ఫలితంగా ప్రాథమిక పాఠశాలల్లో ప్రవేశాలు గణనీయంగా తగ్గాయి.

హేతుబద్ధీకరణ పేరిట వేటు వేసి

మరోవైపు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల హేతుబద్ధీకరణకు గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జీవో 117ను తెచ్చి అస్తవ్యస్త విధానాలు అమలు చేసింది. దీన్ని అమలు చేస్తే ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ బడులుగా మారుతాయని ఉపాధ్యాయులు గగ్గోలు పెట్టినా పట్టించుకోలేదు. ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయుల సంఖ్య తగ్గుతుందని హెచ్చరించినా లెక్క చేయలేదు. ఇలా ఐదేళ్లలో విద్యాశాఖను భ్రష్టు పట్టించారు.



మూడేళ్లుగా దిగజారుతూ

2021- 22లో ప్రభుత్వ ఆధ్వర్యంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో కలిపి 1,84,138 మంది విద్యార్థులు చేరారు. తర్వాత విద్యా సంవత్సరంలో ఏకంగా 13,156 ప్రవేశాలు తగ్గాయి. దీంతో 1,70,982 మాత్రమే చేరారు. 2023- 24లో పరిస్థితి మరింత దిగజారి 1,54,191గా విద్యార్థుల సంఖ్య నమోదైంది. అప్పటి ప్రభావంతో ప్రస్తుత విద్యా సంవత్సరంలోనూ 1,50,120 ప్రవేశాలు ఉన్నాయి. మూడేళ్లుగా ఇలా చిన్నారుల సంఖ్య దిగజారుతూనే ఉంది. ఐదేళ్లలోని లోటుపాట్లను ఒకొక్కటిగా సరిదిద్దితేనే ప్రభుత్వ పాఠశాలలు గాడిలో పడతాయి.

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: ఎస్ఎస్‌డీ టోకెన్లు లేకుండా గురువారం సాయంత్రానికి క్యూలైన్లలో వచ్చిన భక్తులకు దాదాపు పది గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. బుధవారం శ్రీవారిని 64,447 మంది దర్శించుకోగా రూ.3.38 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

నిధుల్లేని భూ సంరక్షణ

- కాలయాపనలో ఉద్యోగులు
- ఐదేళ్లు గాలికొదిలేసిన వైకాపా ప్రభుత్వం

చిత్తూరు (వ్యవసాయం), న్యూస్‌టుడే: నేలను, నీటిని సంరక్షించాలనే సంకల్పంతో వ్యవసాయ శాఖ అనుబంధంగా భూసార సంరక్షణ విభాగం దశాబ్దాల క్రితమే ఏర్పాటైంది. ఈ విభాగానికి సంబంధించి ఉమ్మడి జిల్లాలో చిత్తూరు, పుంగనూరు, మదనపల్లె, తిరుపతి డివిజన్లు ఉండగా.. జిల్లా కార్యాలయంలో చిత్తూరులోనే ఉంది.. ఏటా ఈ విభాగానికి రూ.10-15 కోట్ల వరకు పథకాలకు నిధులు విడుదలవుతున్నాయి. 2019 వరకు పథకాలన్నీ కొనసాగి.. వర్షాధార ప్రాంత రైతులకు లబ్ధి చేకూరేది. వైకాపా ప్రభుత్వం ఈ విభాగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసి.. ఒక్క పైసా నిధులు విడుదల చేయలేదు.

గత ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం భూసార సంరక్షణ విభాగానికి ఒక్క పథకం అమలు చేయలేదు. గతంలో కేంద్ర ప్రభుత్వం ద్వారా వర్షాధార ప్రాంత అభివృద్ధి పథకం(ఆర్ఏడీపీ), ప్రధానమంత్రి కృషి సించాయి యోజన(పీఎంకేఎస్‌వై), రాష్ట్ర ప్రభుత్వం భూమి, నీటి సంరక్షణ(ఎస్‌డబ్ల్యూసీ) తదితర పథకాల ద్వారా వర్షాధార ప్రాంత రైతుల ఆర్థిక అభ్యున్నతి, వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేవి. ఈ పథకాల కింద రాయితీపై నీటి సరఫరా పైపులు, వాటర్ షెడ్ల నిర్మాణం, పారం పాండ్ల నిర్మాణం, గొర్రెలు, పశువుల యూనిట్లు, చెక్ డ్యామ్‌ల నిర్మాణం, ఉద్యాన పంటల విస్తరణకు సాగు ప్రోత్సాహకాలు అందించి ఆదుకునేవారు. ఆయా పథకాలకు ఏటా రూ.10-15 కోట్లు నిధులు మంజూరయ్యేవి. 2019 నుంచి ఈ పథకాలన్నీ పూర్తిగా ఆగిపోయాయని ఆ విభాగ అధికారులు పేర్కొనడం గమనార్హం.

పని లేక.. పాలుపోక..

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వర్షాధారంతో పంటల సాగు విస్తీర్ణం ఎక్కువ. వ్యవసాయ శాఖ తర్వాత. భూసార సంరక్షణ విభాగం కీలకం. ఉమ్మడి జిల్లాలో నాలుగు డివిజన్లు ఉండగా.. నలుగురు ఏడీలకు ఇద్దరు ఏడీలు పనిచేస్తున్నారు. నలుగురు ఏవోలు విధులు నిర్వహిస్తున్నారు. క్షేత్ర స్థాయి అధికారులు, సిబ్బందితో పాటు కార్యాలయ పర్యవేక్షకులు, మినిస్టీరియల్ ఉద్యోగులు, సిబ్బంది ఉన్నారు. ఉన్నవారు కాలయాపన చేస్తూ వేతనాలు పొందుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



రూ. కోట్లలో బకాయిలు

తెదేపా పాలనలో 2017 నుంచి 2019 వరకు మూడు పథకాల కింద లబ్ధి పొందిన 3,062 మంది రైతులకు రూ.10.87 కోట్లు చెల్లించాల్సి ఉంది. వైకాపా ప్రభుత్వం బకాయిలు విడుదల చేయకుండా లబ్ధిదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. కొందరు కోర్టుకెళ్లడంతో 404 మందికి రూ.1.87 కోట్లు విడుదలయ్యాయి. మిగిలిన వారికి విడుదల కాలేదు. కూటమి ప్రభుత్వం బకాయిలు విడుదల చేసి పథకాల పక్కా అమలుకు దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

రేపటి నుంచి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు

తిరుపతి(క్రీడలు), న్యూస్‌టుడే: ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్- 19 స్కూల్ గేమ్స్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎస్.జయరామయ్య తెలిపారు. 26న తిరుపతి బాలాజీకాలనీలోని శ్రీవిశ్వేశ్వర యోగా సర్చ్ ఇన్‌స్టిట్యూట్ వేదికగా యోగాసన పోటీలు, 27న రేణిగుంట జడ్పీ బాలికల పాఠశాలలో సాఫ్ట్ టెన్నిస్, స్క్వాష్, ఉషు, తిరుపతి శ్రీశ్రీనివాస క్రీడా సముదాయంలో క్రికెట్ పోటీలు, 30న చిత్తూరు డీఎస్ఏ స్టేడియంలో ఖోఖో, రోప్ స్కిప్పింగ్, ఫెన్సింగ్ పోటీలు జరుగుతాయన్నారు. వివరాలకు 93936 21004లో సంప్రదించాలని సూచించారు.



ఆకట్టుకున్న రష్యన్లు..

మన సంస్కృతి, సంప్రదాయమైన పంచెకట్టుతో రష్యన్లు శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్నారు. సంప్రదాయ దుస్తులతో పది మంది రష్యా భక్తులు గురువారం శ్రీకాళహస్తీశ్వరుని దర్శనార్థం వచ్చారు. ఆలయం తరఫున వారికి దర్శన ఏర్పాట్లు చేయించారు. మగవారు పంచెకట్టులో, మహిళలు సంప్రదాయ వస్త్రధారణతో దర్శనానికి రావడం స్వదేశీ భక్తులను ఆకట్టుకుంది. ఆలయంలోని శిల్పకళకు రష్యన్లు మంత్రముగ్ధులయ్యారు.

- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

షీ బాక్సుల ఏర్పాటుకు అనుమతివ్వండి



కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగినులు

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రత్యేకంగా షీ బాక్సులు ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఉద్యోగినులు విన్నవించారు. ఏపీ ఐకాస అమరావతి మహిళా విభాగం తరపున గురువారం కలెక్టర్‌కు వారు వినతిపత్రం అందజేశారు. ఉద్యోగినులు మాట్లాడుతూ కార్యాలయాల్లో పనిచేసే మహిళలకు అనేక రకాలైన వేధింపులు ఎదురవుతున్నాయని చెప్పారు. ఫిర్యాదుచేస్తే ఉద్యోగ పరంగా, వ్యక్తిగతంలో కెరీర్ దెబ్బతింటుందనే కారణంతో మహిళలు ఎన్నో ఫిర్యాదుల్ని బయటకు చెప్పలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యాలయాల్లో ఈ బాక్సుల ఏర్పాటుతో తాము ధైర్యంగా ఫిర్యాదు చేసేందుకు అవకాశం కల్పించాలని ఐకాస ఛైర్‌పర్సన్ జయంతి, ప్రధాన కార్యదర్శి పుష్పలత కోరారు.

25 మండలాల్లో వర్షం

చిత్తూరు (మిట్టూరు), న్యూస్‌టుడే: అల్పపీడన ప్రభావంతో బుధవారం రాత్రి జిల్లాలోని 25 మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. వెదురుకుప్పం మండలంలో 45.2 మి.మీటర్లు, గంగవరం 34.6, ఎస్ఆర్‌పురం 33.6, కుప్పం 29, రామకుప్పం 22.2, శాంతిపురం 20.8, పూతలపట్టు 20.4, గుడుపల్లె 20.2, గుడిపాల 19.2, పలమనేరు 15.4, బైరెడ్డిపల్లె 13.4, తవణంపల్లె 13, యాదమరి 12.6, బంగారుపాళ్యం 12, పెద్దపంజాణి 10.6 మి.మీటర్లు కురవగా.. మిగిలిన మండలాల్లో చిరుజల్లుల వర్షపాతం నమోదైంది.

గాలికొదిలేశారు

పౌరసరఫరాలశాఖలో అవినీతి జరిగితే సహించేది లేదని సీఎం చంద్రబాబు సహా పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రతి సమీక్షలో స్పష్టమైన ఆదేశాలు ఇస్తున్నారు. ఇటీవల ఆయనే స్వయంగా కృష్ణా జిల్లాలో తనిఖీలు నిర్వహించి రేషన్ బియ్యం పట్టుకున్నారు. జిల్లాస్థాయిలో ఆ శాఖను పర్యవేక్షిస్తున్న జేసీల్లో చలనం లేకపోవడంతో గోదాముల్లో అవినీతి పెచ్చరిల్లుతోంది.

- పౌరసరఫరాల గోదాం డీటీల కనుసన్నల్లో అవినీతి
- బయటకు పొక్కనివ్వని జేసీలు!
- పెచ్చరిల్లిన అక్రమాలు

పుత్తూరు, న్యూస్‌టుడే: జిల్లాలోని పౌరసరఫరాలశాఖ గోదాంలపై పర్యవేక్షణ కరవైంది. ఆయా గోదాం డీటీల కనుసన్నల్లో అవినీతి పెచ్చుమీరుతోంది. అడ్డుకట్ట వేయాల్సిన ఉన్నతాధికారులెవరూ పట్టించుకోకపోవడంతో ఆ శాఖ అధికారులు, సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. రేషన్ బియ్యాన్ని గోదాంల నుంచి అక్రమంగా తరలించేస్తున్నారు.



పుత్తూరు పౌరసరఫరాల శాఖ గోదాము

ఇలా తరలింపు

పేదల రేషన్ బియ్యం కొందరు ఇంటి దొంగల మూలంగా పక్కదారి పడుతోంది. ఇటీవల పుత్తూరులో 213 టన్నుల బియ్యం అక్రమంగా తరలినట్లు గుర్తించి గోదాం డీటీ విష్ణును సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. తిరుపతి జిల్లాలో 12, చిత్తూరు జిల్లాలో 14 గోదాంలున్నాయి. వీటికి రేణిగుంట, ఏర్పేడు, చిత్తూరు ఎఫ్‌సీఐ గోదాంల నుంచి బియ్యం తరలిస్తారు. అక్కడి నుంచి రేషన్ దుకాణాలకు లారీల్లో తరలిస్తుంటారు. ఈ క్రమంలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి.

పర్యవేక్షణ ఏదీ?

ప్రతి నెలా కొన్ని గోదాములను తనిఖీ చేయాల్సిన జేసీలు ఇతరత్రా పనుల నేపథ్యంలో ఆయా స్థానాల నుంచి కదలడం లేదు. పౌరసరఫరాల శాఖలోని ఉన్నతాధికారుల నివేదికలనే రాష్ట్ర స్థాయి అధికారులకు చెప్పి మమ అనిపిస్తున్నారు. గతంలో కొందరు ఉన్నతాధికారులు మామూళ్లకు అలవాటుపడటంతో అక్రమాల వ్యవహారాలు బయటకు పొక్కనీయడం లేదు.

పత్తాలేని తనిఖీలు..

ఈ గోదాంలను ప్రతి నెలా ఆ శాఖ ఉన్నతాధికారులు తనిఖీ చేసి సంతకం చేసి మమ అనించేస్తున్నారు. దీంతో సీఎస్‌డీటీలు సైతం దర్జాగా అక్రమాలకు తెర లేపుతున్నారు. పుత్తూరు గోదాంలో ఇలాంటి పరిస్థితే నెలకొంది. జిల్లాలోని అన్ని గోదాంలను ఓసారి తనిఖీ చేస్తే ఇలాంటి అక్రమాలు మరిన్ని వెలుగుచూసే అవకాశం ఉంది. ప్రతి గోదాంకు కొత్తగా వచ్చే డీటీలకు తక్కువ సరకుతోనే బాధ్యతలు అప్పగిస్తున్నట్లు సమాచారం. ఇది ప్రతి గోదాంలో ఉండటంతో తేలుకుట్టిన దొంగల్లా ఎవరికివారు బాధ్యతలు తీసుకుంటున్నారు. ఉన్నతాధికారులు తనిఖీకి వస్తే కొంత మొత్తం ముట్టజెప్పి కప్పిపుచ్చుకుంటున్నారు.

జోగుతున్న విజిలెన్స్ శాఖ

జిల్లాలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిద్రపోతున్నారు. అప్పుడప్పుడు తూతూమంత్రంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. నేరుగా కార్యాలయానికి ఫిర్యాదు అందితే తప్ప ఈ విభాగం అధికారులు కాలు బయట పెట్టడం లేదు.

చురుగ్గా 'పీఎం సూర్యఘర్' అమలు

చిత్తూరు (మిట్టూరు), న్యూస్‌టుడే: సౌర విద్యుత్తు వినియోగానికి పీఎం సూర్యఘర్ పథకం అమలును వేగవంతం చేయాలని జెన్‌కో సీఎండీ చక్రధర్‌బాబు, ట్రాన్స్‌కో జేఎండీ చేకూరి కీర్తి ఆదేశించారు. ఈ పథకం అమలుపై విద్యుత్తుశాఖ అధికారులతో గురువారం వారు వీడియో సమావేశం నిర్వహించారు. నెడ్‌క్యాప్, విద్యుత్తుశాఖ అధికారులు సంయుక్తంగా ప్రతి ఇంటికీ సౌర విద్యుత్తు వినియోగించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఐదు వేల జనాభా కలిగిన గ్రామాలు గుర్తించి ఆ గ్రామాల్లో సామూహిక, వ్యక్తిగతంగా సౌర విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా నుంచి విద్యుత్తు శాఖ ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్, ఈఈలు మునిచంద్ర, వాసుదేవరెడ్డి, ఇంజినీర్లు పాల్గొన్నారు.



విరాళం అందిస్తున్న శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు

కాటేజీ నిర్మాణానికి విరాళం

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి ఆలయం వద్ద కాటేజీ నిర్మాణానికి పల్నాడు జిల్లా నరసరావుపేట వాసి ఎస్.శ్రీనివాసరావు, ఉమాదేవి రూ.6.5 లక్షలను ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణికి గురువారం అందజేశారు. దాత, కుటుంబ సభ్యులకు స్వామివారి దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలు అందించారు. పండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి ఉన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి జూనియర్ ఖోఖో పోటీలు



పోటీల ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, అధికారులు

ఐరాల, న్యూస్‌టుడే: కాణిపాకం జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నుంచి 27 వరకు 43వ రాష్ట్రస్థాయి జూనియర్ ఖోఖో పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లబోతుల ప్రవీణ్ గురువారం తెలిపారు. పాఠశాలలో ఏర్పాట్లు పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించనున్నారన్నారు. పోటీల ప్రారంభానికి ముఖ్యఅతిథులుగా ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు కలికిరి మురళీమోహన్, గురజాల జగన్మోహన్ విచ్చేస్తారని చెప్పారు. ఖోఖో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శరత్, జిల్లా క్రీడాధికారి బాలాజీ, తెలుగురైతు జిల్లా ఉపాధ్యక్షుడు గంగారపు హరిబాబునాయుడు, కాణిపాకం ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, మాజీ సర్పంచి కేసీ మధుసూదన్‌రావు, పాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్‌నాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

మామిడి రైతులకు అండగా ఉండాలి

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: జిల్లాలో రానున్న ఏడాది మామిడి పంట చాలెంజ్ కానుంది. ఉద్యాన, వ్యవసాయాధికారులు మామిడి రైతులకు అండగా ఉండి నూతన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక మ్యాంగో భవన్‌లో మామిడి పంట సస్యరక్షణ చర్యలపై రైతు సేవా కేంద్రాల అధికారులకు గురువారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. మామిడిలో తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడుల విధానాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఒక్కో రైతు సేవా కేంద్రం పరిధిలో 200-300 మంది మామిడి రైతులు ఉంటారని, వారికి ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు మామిడిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలపై తెలియజేయాలన్నారు. దీని సాగులో అభ్యుదయ రైతులను గుర్తించి వారు అనుసరిస్తున్న పద్ధతులను తోటి రైతులకు తెలియజేయాలని చెప్పారు. రైతు సేవా కేంద్రాల పనితీరును తరచూ వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు పరిశీలించాలని, ఈ కేంద్రాల ద్వారా రైతులకు సేవలందుతున్నాయా..? పంటల సాగు తీరు తదితర అంశాలను క్షేత్రస్థాయి పరిశీలించి రైతులకు సాగు సాంకేతిక సలహాలు తెలియజేయాలన్నారు. అనంతరం ఉద్యాన శాస్త్రవేత్తలు రంజిత్‌కుమార్, కవిత మామిడిలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులపై సమగ్రంగా వివరించారు. ఉద్యాన శాఖ డీడీ మధుసూదనరెడ్డి, వ్యవసాయశాఖ జేడీ మురళీకృష్ణ, సూక్ష్మనీటిసాగు పథకం పీడీ బాలసుబ్రహ్మణ్యం, రైతు సేవా కేంద్రాల అధికారులు పాల్గొన్నారు.



ముళ్లపొదల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

జీడీనెల్లూరు, న్యూస్‌టుడే: చిత్తూరు-పుత్తూరు ప్రధాన రహదారిపై బొబ్బిగానిపల్లె సమీపంలో గురువారం ప్రమాదవశాత్తూ ఆర్టీసీ బస్సు ముళ్లపొదల్లోకి దూసుకెళ్లింది. చిత్తూరు-పుత్తూరు ఆర్టీసీ బస్సు బొబ్బిగానిపల్లె సమీపంలో పుత్తూరు వైపు వెళ్తూ.. ఎదురుగా వేగంగా వస్తున్న లారీని డ్రైవర్ తప్పించబోయాడు. ఈ క్రమంలో అదుపు తప్పి పక్కనున్న ముళ్లపొదల్లోకి బస్సును తీసుకెళ్లినట్లు ప్రయాణికులు తెలిపారు. అదృష్టవశాత్తూ ఎవరికీ గాయాలు కాలేదు. పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

టేబుల్ టెన్నిస్ జట్ల ఎంపిక



జిల్లా జట్టుకి ఎంపికైన ఆటగాళ్లు

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14, అండర్-17 టేబుల్ టెన్నిస్ జిల్లా బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు గురువారం చిత్తూరులోని బృందావన్ పాఠశాలలో నిర్వహించారు. వివిధ మండలాలకు చెందిన బాలబాలికలకు ఎంపిక పోటీల్లో తలపడ్డారు. వీరి నుంచి తుది జట్లను ఖరారు చేశారు. త్వరలో నంద్యాలలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆటగాళ్లు తలపడనున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి వసంతవాణి తెలిపారు. బృందావన్ పాఠశాల నిర్వాహకురాలు శైలజాకుమారి, డైరెక్టర్ ప్రియ, పీడీ, పీఈటీలు పాల్గొన్నారు.

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	126
రిటైల్	148
లేయర్	115
బ్రాయిలర్స్	215
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	244
లేయర్ మాంసం	195

విద్యార్థులు క్రీడల్లో రాణిస్తేనే ఉజ్వల భవిత



ఎంపికైన జిల్లా స్థాయి కబడ్డీ జట్టు

పుత్తూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు క్రీడల్లో రాణిస్తేనే ఉజ్వల భవిత ఉంటుందని డీవైఈవో ప్రభాకర్ రాజు పేర్కొన్నారు. స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14 విభాగంలో బాలబాలికల కబడ్డీ జట్టు గురువారం ఎంపిక చేశారు. రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. వీరు నవంబరులో బాపట్లలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బాబు తెలియజేశారు. ఎంఈవోలు తిరుమలరాజు, బాలసుబ్రహ్మణ్యం, పీడీలు నందకుమార్, సదాశివం, గోపీకృష్ణ, మణి, కిషోర్, చెన్నకేశవ, జయప్రకాష్, సుబ్రహ్మణ్యం, వెంకటేష్, గురప్ప, లోకేష్, అమ్ములు పాల్గొన్నారు.

మరుద పాండి సేవలు చిరస్మరణీయం



మరుద పాండి సోదరుల విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ అముద, సురేష్ తదితరులు

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ పాలకులతో పోరాడి అసువులు బాసిన మరుద పాండి సోదరుల సేవలు చిరస్మరణీయమని చిత్తూరు నగర మేయర్ అముద, మొదలియార్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ టి.జి.సురేష్ అన్నారు. గురువారం మరుద సోదరులు 223వ వర్ధంతి సందర్భంగా స్థానిక గంగినేని చెరువు వద్ద వారి విగ్రహాలకు నివాళులర్పించి, పేదలకు అన్నదానం చేశారు. వారు మాట్లాడుతూ బ్రిటిష్ పాలనను వ్యతిరేకించి దేశం కోసం పోరాడినందుకు 1801లో మరుద సోదరులతో పాటు వారి వంశస్థులు అందరినీ ఉరి తీసి చంపారన్నారు. వారిని స్మరించుకోవడం, అలాంటి మహనీయులను ఎన్నటికీ గుర్తుంచుకోవాలన్నారు. నాయకులు అప్పు, కృష్ణమూర్తి, కార్పొరేటర్లు శ్రీకాంత్, కుట్టి తదితరులు పాల్గొన్నారు.

రెండోసారి విచారణ

ఈనాడు కథనానికి స్పందన

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న నలుగురు ఆడిట్ అధికారులను ఆడిట్ శాఖ కర్నూలు రీజియన్ డిప్యూటీ డైరెక్టర్ గోవిందప్ప గురువారం విచారించారు. 'ఈనాడు'లో 'పైరవీలకే ప్రాధాన్యం, విచారణల తీవ్ర జాప్యం' శీర్షికన కథనం ఆగస్టు ఆరో తేదీన ప్రచురితమైంది. దీనిపై ఆడిట్ శాఖ ఉన్నతాధికారులు స్పందించారు. ఆగస్టు ఏడో తేదీన ఆర్‌డీడీ విచారించారు. మదనపల్లె బీటీ కళాశాలలో 2022లో అసిస్టెంట్ ఆడిట్ అధికారి(ఏఏవో) శ్రీనివాసులురెడ్డి, సీనియర్ ఆడిటర్లు ధరణీకుమార్, వరలక్ష్మి, ప్రమీల ఆడిట్ నిర్వహించారు. ఆడిట్ అధికారులు అక్రమాలకు పాల్పడ్డారని కళాశాల ప్రిన్సిపల్ రాష్ట్ర ఆడిట్ శాఖ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పట్లోనే అవినీతిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి నివేదించాలని కర్నూలు ఆర్‌డీడీని ఆదేశించారు. ఈ క్రమంలో నలుగురు ఆడిట్ అధికారులను విచారించారు. విచారణకు సంబంధించి సమగ్ర వివరాలను త్వరలో రాష్ట్ర డైరెక్టర్‌కు నివేదించనున్నామని గోవిందప్ప తెలిపారు.

సభ్యత్వ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు(జిల్లా పంచాయతీ): తెదేపా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో విజయవంతం చేయాలని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెదేపా అధినేత చంద్రబాబు ఈ నెల 26న సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారని, సభ్యత్వం పార్టీ కార్యకర్తలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గతంకంటే ఈసారి సభ్యుల సంఖ్య పెరగాలని, రూ.100తో సభ్యత్వం తీసుకుంటే ప్రమాద బీమా రూ.5 లక్షలు, సహజ మరణానికి రూ.10 వేలు వర్తిస్తుందన్నారు.

దారి తెలియదు.. సిగ్నల్ కనిపించదు



సిగ్నల్ లైట్‌ను కమ్మేసిన వృక్ష మొక్కలు



కనిపించని బోర్డులు

ప్రముఖ పుణ్యక్షేత్రం కాణిపాకం ఆలయానికి నిత్యం వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు దర్శనం కోసం వస్తారు. వీరి సౌకర్యార్థం ఆయా ప్రాంతాలకు దారి చూపేందుకు బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతోపాటు అక్కడక్కడ సిగ్నల్ లైట్లు పెట్టారు. ఇవన్నీ ప్రస్తుతం పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. దీంతో ఏ ఊరు.. ఎటు వెళ్లాలో తెలియక వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. చిత్తూరు నుంచి ఐరాల వెళ్లే మార్గంలోని 45.కొత్తపల్లి క్రాస్ వద్ద ఏర్పాటు చేసిన బోర్డులు, సిగ్నల్ లైట్లు కనిపించనంతగా వృక్ష మొక్కలు నిండిపోయాయి. వీటిని తొలగించి భక్తులకు సౌకర్యంగా ఉండేలా చూడాల్సిన అవసరం ఉంది. **-ఈనాడు, చిత్తూరు. న్యూస్‌టుడే, ఐరాల**

చిరుతను హింసించి చంపారు: డీఎఫ్‌వో

- ఐదుగురి అనుమానితులను అదుపులోకి తీసుకున్నాం
- చిరుత కాలిగోర్లు, పళ్లు స్వాధీనం చేసుకున్నాం



వివరాలు వెల్లడిస్తున్న డీఎఫ్‌వో భరణి

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: యాదమరి మండలం తాళ్లమడుగు సమీపంలో ఇటీవల మృతి చెందిన చిరుతను వేటగాళ్లు హింసించి చంపారని డీఎఫ్‌వో భరణి వెల్లడించారు. స్థానిక అటవీశాఖ కార్యాలయంలో ఆమె గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అడవి పందుల కోసం విద్యుత్తు వైర్లు అమర్చారని, అందులో చిరుత చిక్కి షాక్‌తో అపస్మారక స్థితిలోకి చేరుకున్నాక వేటగాళ్లు వైర్లతో లాగి హింసించారని పోస్టుమార్టం నివేదికలో తేలిందన్నారు. ఈ ఘటనలో బంగారుపాళ్యం మండలం వెలుతురుచేనుకు చెందిన ఐదుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు. చిరుత నాలుగు పాదాలు, గోళ్లతో సహా పళ్లను నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్నామన్నారు. కౌండిన్య అటవీ ప్రాంతం ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులో ఉన్నందున ఎన్ని చిరుతలు ఉన్నాయనేది లెక్కించలేకున్నామని తెలిపారు. అడవుల్లో ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసి లెక్కిస్తామని చెప్పారు. అటవీ సమీప ప్రాంతాల్లో జంతువుల వేట కోసం ఏర్పాటు చేసిన వైర్లను వెంటనే తొలగించాలని కలెక్టర్ విద్యుత్తుశాఖ అధికారులను ఆదేశించారన్నారు. సోమల మండలంలో ఇటీవల చిరుత ప్రమాదవశాత్తూ లోయలో పడి మృతి చెందిందని, జంతువులను వేటాడే తీరుపై చెన్నైకి చెందిన క్రైమ్ సెంట్రల్ బ్యూరో సహకారం తీసుకున్నామన్నారు. పశ్చిమ విభాగం ఎఫ్ఆర్వో బాలకృష్ణారెడ్డి, క్రైమ్ సెంట్రల్ బ్యూరో అధికారి రాజశేఖర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో చిత్తూరు జట్టు విజేత

బంగారుపాళ్యం: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో జరిగిన వాలీబాల్ ఫైనల్ పోటీల్లో గుంటూరు జిల్లా జట్టుపై చిత్తూరు జట్టు విజేతగా నిలిచింది. ఈ పోటీలు ఈ నెల 21 నుంచి 23 వరకు సత్యసాయి జిల్లా హిందూపురంలో జరిగాయని జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు సిరాజ్ అహ్మద్ తెలిపారు. బంగారుపాళ్యానికి గురువారం గెలుపొందిన జట్టు చేరుకుందని, క్రీడాకారులను అసోసియేషన్ కార్యదర్శి సుదర్శన నాయుడు, మాజీ క్రీడాకారులు, జడ్పీ మాజీ ఛైర్మన్ కుమార్‌రాజా, మాజీ సర్పంచి కృష్ణమూర్తి, కోశాధికారి మురారీ, పీఈటీలు గిరిజ, మధు, నాగయ్య, స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేంద్ర, పార్థసారథి అభినందించారు. బాలికల విభాగంలో చిత్తూరు జిల్లా జట్టు రన్నర్‌గా నిలిచిందని తెలిపారు.

నూతన కార్యవర్గం



జయంతి సరిత

చిత్తూరు కలెక్టరేట్: ఆంధ్రప్రదేశ్ ఐకాస అమరావతి జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా జయంతి(యాదమరి డీటీ), సహాధ్యక్షురాలిగా లత(ఆర్టీసీ, చిత్తూరు), కార్యదర్శిగా సరిత(కలెక్టరేట్) ఎన్నికయ్యారు. సమగ్ర శిక్ష, రెవెన్యూ, సహకార శాఖలకు చెందిన 10 మంది కార్యవర్గాన్ని గురువారం చిత్తూరురెవెన్యూ భవనంలో జరిగిన ఎన్నికలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర అధ్యక్షురాలు శివకుమారి, ప్రధాన కార్యదర్శి విజయలక్ష్మి విచ్చేశారు. చిత్తూరు డివిజన్ అధ్యక్షురాలిగా హిమగిరి, సహాధ్యక్షురాలిగా పుష్ప, కార్యదర్శిగా బిందుశ్వేత, ఎనిమిది మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

పులి పిల్లంటూ భయాందోళన

పుంగనూరు: మేలుపట్లకు చెందిన రైతు దొరబాబు పొలం నుంచి వస్తుండగా మేలుపట్ల వ్యవసాయ పొలాల నుంచి బైపాస్ రోడ్డు దాటుకుని చదళ్ల చెరువులోని తుమ్మ చెట్ల పొదల్లోకి గురువారం ఉదయం పులిపిల్ల వెళ్లడాన్ని గుర్తించాడు. ఎఫ్ఆర్వో శ్రీరాములు ఆదేశాలతో సిబ్బందియువత సహకారంతో గాలింపు చర్యలు చేపట్టారు. పిల్ల కావడం, వ్యవసాయ పొలాలు కాబట్టి ఎలాంటి గుర్తులు లభించలేదు.

కాలానుగుణ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

చిత్తూరు(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కాలానుగుణ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని.. వైద్యాధికారులు వాటిపై అప్రమత్తం కావాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి ప్రభావతీదేవి ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి జూమ్ సమావేశంలో ఆమె మాట్లాడారు. అంటువ్యాధులు ప్రబలినప్పుడు స్థానిక ఆస్పత్రి వైద్య బృందం అప్రమత్తమై ఐహెచ్ఐపీ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. నీటిని పరీక్షించి, కలుషిత బ్యాక్టీరియా ఉందో లేదో గుర్తించాలన్నారు.

బావిలో పడి వృద్ధుడి మృతి

వెదురుకుప్పం, న్యూస్‌టుడే: మాంబేడు గ్రామానికి చెందిన సంజీవయ్య(70) కొద్దికాలంగా మతి స్థిమితం కోల్పోయి తిరుగుతున్నారు. మూడ్రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లిన అతడి కోసం కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గ్రామాల్లో విచారించారు. గురువారం ఉదయం బావిలో బాగా కుళ్లిన స్థితిలో తేలుతున్న మృతదేహాన్ని గ్రామస్థులు గుర్తించారు. బావి వద్దకు చేరుకుని పరిశీలించగా సంజీవయ్యగా గుర్తించి సమాచారాన్ని అతడి కుటుంబీకులకు తెలియజేశారు. ప్రమాదవశాత్తూ బావిలో పడి మృతి చెంది ఉండొచ్చని తెలిపారు.

శ్రీగంధం దొంగల అరెస్ట్

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: శ్రీగంధం దొంగిలించి విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి రిమాండుకు పంపామని డీఎఫ్‌వో భరణి తెలిపారు. స్థానిక అటవీశాఖ పశ్చిమ విభాగం కార్యాలయంలో ఆమె గురువారం నిందితుల వివరాలు వెల్లడించారు. జిల్లాలో ఎర్రచందనం స్మగ్లింగ్ జరుగుతోందని, దీనిలో భాగంగా తమకు అందిన సమాచారం మేరకు ఈ నెల 20న చిత్తూరు నగరం గోకులం వీధిలో రూ.66 వేల విలువ చేసే నాలుగు కిలోల శ్రీగంధం చెక్కలు విక్రయిస్తుండగా చిత్తూరు నగరానికి చెందిన విజయకుమార్, చిత్తూరు గ్రామీణ మండలం శేషాపురానికి చెందిన రాజేంద్ర, గణేష్‌ను అదుపులోకి తీసుకుని వారి నుంచి శ్రీగంధం చెక్కలు, తూకం వేసే త్రాసు, కత్తులు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎవరైనా ఎర్రచందనం, శ్రీగంధం చెక్కల అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు చేపడతామని ఆమె హెచ్చరించారు.



దొంగలను చూపుతున్న అటవీశాఖ అధికారులు

చిత్తూరు

• చిత్తూరు • పూతలపట్టు • గంగాధరనెల్లూరు • నగరి



నిరాశ్రయుల సమస్యలు తెలుసుకుంటున్న పద్మజ

నిరాశ్రయులకు అండగా ఉంటాం

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: నిరాశ్రయులకు అండగా ఉంటామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌ఛార్జి కార్యదర్శి పద్మజ తెలిపారు. స్థానిక కట్టమంచిలోని నగరపాలక పట్టణ పేదల రాత్రి వసతిగృహాన్ని గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా నిరాశ్రయుల సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. నిరాశ్రయులకు ఉచిత న్యాయ సేవలు అందిస్తామని తెలిపారు. వసతిగృహ ఇన్‌ఛార్జి జోసఫ్‌రాజు పాల్గొన్నారు.

అంచనాలు సిద్ధం చేయండి.. యాదమరి, న్యూస్‌టుడే: గుంతలమయమై దారుణంగా మారిన చిత్తూరు గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారిని బాగు చేయించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ నిర్ణయించారు. రూ.5 కోట్లు నిధులు మంజూరు చేస్తామని ఈ మేరకు అంచనాలు సిద్ధం చేసి సమర్పించాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
చిత్తూరు నగరం: 80085 74598
నగరి: 80085 74568
గంగాధరనెల్లూరు: 80085 74605
పూతలపట్టు: 80085 74601

న్యూస్‌టుడే, చిత్తూరు నగరం

సమస్య: దొడ్డిపల్లి తేజానగర్‌లో రోడ్డు సదుపాయం కల్పించాలి. మట్టిరోడ్లలో ప్రయాణం ఇబ్బందిగా మారింది.
-స్థానికులు

సమాధానం: పరిశీలించి రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తాం.
-వెంకట్రామిరెడ్డి, ఎంఈ, నగరపాలక సంస్థ

నీటి వృథా అరికడతాం

స్పందనకు వందనం

చిప్పారపల్లె పంచాయతీ గొబ్బిళ్లమిట్ట తాగునీటి ట్యాంకు నుంచి నీరు వృథా కాకుండా చర్యలు తీసుకుంటామని కార్యదర్శి జోతీశ్వరన్ తెలిపారు. ఈ నెల 24న 'ఈనాడు'లో 'తాగు నీరు వృథా' శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన కార్యదర్శి ట్యాంకును పరిశీలించి మోటారును ఆఫ్ చేయకపోవడంతోనే నీరు వృథాగా పోతోందని గుర్తించారు. మాజీ సర్పంచి రాజగోపాల్‌నాయుడితో మాట్లాడారు. నీటి సరఫరా నిర్వహణకు ఓ వ్యక్తిని నియమించనున్నట్లు పేర్కొన్నారు.
-న్యూస్‌టుడే, పెనుమూరు

విద్యార్థులకు మంచి పౌష్టికాహారం అందించాలి



మధ్యాహ్న భోజనం తింటున్న సీనియర్ సివిల్ జడ్జి రాఘువేంద్ర

పుత్తూరు, న్యూస్‌టుడే: విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వ మెనూ ప్రకారం మంచి పౌష్టికాహారం అందించాలని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి రాఘువేంద్ర పేర్కొన్నారు. నారాయణవనం జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం మధ్యాహ్నం భోజనాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలన్నారు. వంటగది, నిత్యవసరాలు నిల్వ చేసే గది పరిశీలించారు. మధ్యాహ్నం భోజనం తిని సంతృప్తి వ్యక్తం చేశారు. భోజనం నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని ప్రధానోపాధ్యాయురాలు శశికళకు సూచించారు. ఆయన వెంట ఏఎస్‌ఐ జయరాంనాయక్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆడిట్ అభ్యంతరాలపై చర్యలు తీసుకోండి



ఆడిటర్లతో సమీక్షిస్తున్న ఆర్‌డీడీ గోవిందప్ప

చిత్తూరు(మిట్టూరు): ప్రభుత్వ శాఖల్లో ఆడిట్ అభ్యంతరాలు రోజురోజుకు పేరుకుపోతున్నాయి. సకాలంలో ఆడిట్ అభ్యంతరాలను పరిష్కరించుకొని పక్షంలో సంబంధిత శాఖలపై చర్యలు తీసుకోవాలని ఆడిట్‌శాఖ కర్నూలు రీజియన్ డిప్యూటీ డైరెక్టర్ గోవిందప్ప పేర్కొన్నారు. గురువారం జిల్లా ఆడిట్‌శాఖ కార్యాలయంలో ఆడిటర్లతో సమీక్షించారు. ఆడిట్ నిర్వహణలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అభ్యంతరాలు నిర్ణీత రోజుల్లో పరిష్కరించుకోకుంటే చర్యలకు ఉపక్రమించాలని సూచించారు. 2023-24 ఆడిట్ సకాలంలో పూర్తిచేసి అంతర్జాలంలో నమోదు చేయాలన్నారు. జిల్లా ఆడిట్ అధికారి

నగరవాసికి.. కాసింత ఊరట..!

☛ నీటి ఎద్దడి తప్పినట్లే ☛ వరద నీటితో నిండిన ఎన్టీఆర్ జలాశయం

న్యూస్‌టుడే, చిత్తూరు నగరం

చిత్తూరు నగరపాలక పరిధిలో ఈ ఏడాది నీటి సమస్య లేనట్లే.. ఇటీవల కురిసిన ఎడతెరపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు నగరానికి ప్రధాన నీటి వనరుగా ఉన్న ఎన్టీఆర్ జలాశయం నిండింది. దీంతో ఈ ఏడాది వేసవిలో నీటి సమస్య నుంచి నగర ప్రజలు గట్టెక్కినట్లే.

నిండుగా నీరు..

నగరపాలక పరిధిలోని 50 డివిజన్లలో 2.03లక్షల మంది జనాభాకు.. రోజుకు 27 ఎంఎల్‌డీల నీటిని అందించాల్సి ఉండగా.. 22 ఎంఎల్‌డీల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రతి వ్యక్తికి రోజుకు 135 ఎల్‌పీసీడీల నీటిని సరఫరా చేయాల్సి ఉండగా.. 100 ఎల్‌పీసీడీల నీటిని అందిస్తున్నారు. నగర నీటి అవసరాలను తీర్చడానికి పెనుమూరు మండలంలోని కలవకుంటలో నిర్మించిన ఎన్టీఆర్ జలాశయం, పూనేపల్లె పాత పంపింగ్ స్టేషన్‌లోని నీటి వనరులు, అద్దె ట్యాంకర్లు, నగరంలోని 421 పవర్ బోర్ల నుంచి ఈ మేరకు సరఫరా చేస్తున్నారు. అల్పపీడన ద్రోణి కారణంగా వర్షాలు కురిసి ఎగువ ప్రాంతం నుంచి ఎన్టీఆర్ జలాశయానికి నీరు చేరింది. జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 110 ఎంసీఎఫ్‌టీలు ఉండగా.. ప్రస్తుతం 110 ఎంసీఎఫ్‌టీల నీరు నిల్వ ఉంది. జలాశయానికి వరద నీరు పోటెత్తడంతో అధికారులు రెండు గేట్లు ఎత్తివేసి దిగువ ప్రాంతానికి నీటిని విడిచి పెట్టాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రతిరోజు 5 ఎంఎల్‌డీల నీటిని జలాశయం నుంచి విడుదల చేసుకుని నగరంలోని వివిధ ప్రాంతాలకు పైప్‌లైన్ ద్వారా సరఫరా చేస్తున్నారు. జలాశయంలోని నీటి నిల్వతో రానున్న వేసవి సీజన్‌లో నీటి సమస్య తలెత్తకపోవచ్చు.

లీకేజీలతో వృథా

మరోవైపు నగరంలో దశాబ్దాల కిందట ఏర్పాటు చేసిన పైప్‌లైన్లు, వాల్వ్‌ల నుంచి లీకేజీలు ఉన్నాయి. పైప్‌లైన్లు తుప్పు పట్టి పగిలిపోవడం, కొత్తగా ఏర్పాటు చేసే సక్రమంగా బిగించకపోవడం తదితర కారణాలతో నీటి లీకేజీ చోటుచేసుకుంటోంది. దీంతో పగలు రాత్రి తేడా లేకుండా గంటల తరబడి పైప్‌లైన్ల ద్వారా నీటి సరఫరా జరుగుతున్న సందర్భాల్లో ఇలా నీరు నేలపాలవుతోంది. నగరంలో 400 వీధులు ఉండగా.. దాదాపు అన్ని వీధుల్లోనూ ఎక్కడో ఒక చోట పైప్‌లైన్లు దెబ్బతిని నీరు వృథా అవుతోంది. మరోవైపు ఇళ్లకు నీటి కనెక్షన్లు ఏర్పాటు చేసే సందర్భాల్లోనూ పలుచోట్ల అనేక తప్పిదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రధాన పైప్‌లైన్ నుంచి ఇళ్లకు సరఫరా చేయడానికి ఒక అంగుళం పరిమాణం కలిగిన గొట్టాలను మురుగునీటి కాలువల నుంచి ఏర్పాటు చేశారు. ఈ పైపులు దెబ్బతింటే మురుగునీరు నేరుగా పైపుల్లోకి వెళ్లి నీరు కలుషితమయ్యే అవకాశాలు ఎక్కువే. లీకేజీల కారణంగా నీటి వృథా మూడు శాతం వరకు ఉంటోందని అంచనా.



ఎన్టీఆర్ జలాశయంలో నీటి నిల్వ

దీపావళి కానుక పంపిణీ



వృద్ధురాలికి చీర అందిస్తున్న పార్థసారథినాయుడు

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: దీపావళిని పురస్కరించుకుని మాజీ కౌన్సిలర్ పార్థసారథినాయుడు గురువారం చిత్తూరు నగరంలోని రాస్ వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న నిర్వాసితులకు పండుగ కానుకగా నూతన దుస్తులు, తీపి మిఠాయిలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం ఆశ్రమంలోని అన్నపూర్ణేశ్వరికి పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. రాస్ ఆశ్రమం మేనేజర్ ముత్యాలశెట్టి పాల్గొన్నారు.

సృజనతో విద్యార్థుల రాణింపు



విజేతలతో శ్రీ చైతన్య పాఠశాల ప్రధానోపాధ్యాయిని సాగరిక, డీన్ ఇక్బాల్

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు ఇతర పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటుకోవాలని శ్రీ చైతన్య పాఠశాల ప్రధానోపాధ్యాయిని సాగరిక కోరారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో నగరంలోని శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీ పరీక్ష గురువారం నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు- విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులు పోటాపోటీగా పరీక్ష రాయగా న్యాయనిర్ణేతలు విజేతలను ప్రకటించారు. హాసిని, మోక్షిత, హిమాన్షుగుప్తా వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలుగా నిలిచారు. వీరికి శ్రీచైతన్య పాఠశాల ప్రధానోపాధ్యాయిని సాగరిక, డీన్ ఇక్బాల్, ఉపాధ్యాయిని దివ్య ప్రశంసా పత్రంతో పాటు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిభకు పట్టం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ గోపి

పుత్తూరు, న్యూస్‌టుడే: పాఠశాల విద్యార్థుల్లో ప్రతిభకు పట్టం కడుతూ 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించడం అభినందనీయమని పరమేశ్వరమంగళంలోని శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపల్ గోపీ పేర్కొన్నారు. మండల పరిధిలోని శ్రీ చైతన్య ఉన్నత పాఠశాలలో 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలో భాగంగా 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభమా-నష్టమా.. విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై విద్యార్థులకు గురువారం వ్యాసరచన పోటీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ వ్యాసరచన పోటీ ద్వారా వెలికితీయవచ్చన్నారు. ప్రతి విద్యార్థి ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థినులు వీక్షిత వాహిని, హేమ, చంద్రిక విజేతలుగా నిలిచారు. విద్యార్థినులకు ప్రిన్సిపల్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వనిత, రోజారాణి, వినోద్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

సమన్వయంతో పరిష్కరించుకోండి

యాదమరి: గ్రామాల్లో సమన్వయంతో సమస్యలు పరిష్కరించుకోవాలని ఆర్డీఓ శ్రీనివాసులు సూచించారు. కలెక్టరేట్‌లోని ప్రజా వినతుల స్వీకరణ విభాగంలో ఇటీవల కుక్కలపల్లికి చెందిన జ్యోతి తన ఇంటికి వెళ్లేందుకు దారి సమస్య ఉందని ఫిర్యాదు చేశారు. కీనాటంపల్లిలో తన పొలానికి దారి సమస్య ఉన్నట్లు మోహన్ వినతి పత్రం ఇచ్చాడు. వీటిని పరిశీలించి ఆయా గ్రామస్థుల అభిప్రాయాల మేరకు పరిష్కరించారు. తహసీల్దారు పార్థసారధి, ఆర్ఐ ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.




వైద్యాధికారిణి శిరీషతో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ ప్రభావతి

సమయపాలన పాటించాలి

బంగారుపాళ్యం: ఆస్పత్రి సిబ్బంది సమయపాలన పాటించాలని జిల్లా ఆస్పత్రి సేవల సమన్వయాధికారిణి ప్రభావతి ఆదేశించారు. బంగారుపాళ్యంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆమె గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డయాలసిస్, ఐసీటీసీ, క్షయవ్యాధి నివారణ, ఫిజియోథెరపీ కేంద్రాలు, ఆస్పత్రిలో రికార్డులను పరిశీలించారు. రోగులకు సేవాభావంతో వైద్యం చేయాలని సూచించారు. ఆమె వెంట వైద్యులు స్వరూప్ నాయక్, అఖిల్, భావన, సిబ్బంది ఉన్నారు

ఆర్థిక సాయం అందించాలి



సీఎం చంద్రబాబుకు విన్నవిస్తున్న సప్తగిరి ప్రసాద్

తవణంపల్లి, న్యూస్‌టుడే: భారీ వర్షాలతో పూతలపట్టు నియోజకవర్గంలో జరిగిన నష్టాన్ని తగ్గట్లుగా ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని సీఎం చంద్రబాబుకు.. తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ విన్నవించారు. సీఎంను గురువారం అమరావతిలో ఆయన కలిశారు. అరగొండ-సరకల్లు మార్గంలో తొడతరతో పాటు అరగొండ-జొన్నగొరకల మార్గంలో అరగొండ వద్ద బహుదా నదిపై వంతెన తెగిపోయిందని, శాశ్వత పరిష్కారం కోసం వంతెన నిర్మించాలన్నారు. పెరుటోనియం డయాలసిస్ చేసుకునేవారికి కిడ్నీ రోగులతో సమానంగా పింఛను ఇప్పించాలన్నారు. చిత్తూరు-యాదమరి-పరదరామి మార్గంలో నూతన రోడ్డు నిర్మించాలని కోరారు. * అర్ధగిరి శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో తొలగించిన 8 మంది ఒప్పంద, పొరుగు సేవల సిబ్బందిని మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి సప్తగిరి ప్రసాద్ విన్నవించారు.



సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా టీకాల అధికారి హనుమంతరావు

పోలియో చుక్కలు వేయించండి

చిత్తూరు (వైద్యవిభాగం), న్యూస్‌టుడే: ప్రజలందరూ తమ పిల్లలకు పోలియో చుక్కల మందు వేయించి పోలియో నివారణకు కృషి చేయాలని జిల్లా టీకాల అధికారి హనుమంతరావు తెలిపారు. ప్రపంచ పోలియో నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం చిత్తూరు నగరంలోని ప్రశాంత్‌నగర్ కాలనీలోని అర్బన్ ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు విధిగా పోలియో చుక్కలు వేయించాలని చెప్పారు. వ్యాధి నిరోధక టీకాను సైతం అర్హులైన పిల్లలకు అందించాలన్నారు. వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

'మహిళా సంక్షేమానికి ప్రాధాన్యం'

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: తెదేపా కూటమి ప్రభుత్వంలో మహిళా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తున్నట్లు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పేర్కొన్నారు. మహిళలకు దీపావళి కానుకగా మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని అమలు చేయాలని నిర్ణయం తీసుకోవడం శుభ పరిణామమన్నారు. ఆలయ పాలక మండళ్లలో బ్రాహ్మణులు, నాయీ బ్రాహ్మణులకు అవకాశం కల్పించాలనే నిర్ణయం చారిత్రాత్మకమైందన్నారు. డ్రోన్ సమ్మిట్ విజయవంతమై ఏపీ సత్తా ప్రపంచానికి చాటిందని, భవిష్యత్తులో యువతకు ఈ రంగంలో ఉపాధి లభించనుందని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో బస్సు సర్వీసు

విజయపురం, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చొరవతో మల్లారెడ్డికండ్రిగ గ్రామానికి సత్యవేడు డిపో నుంచి బస్సు సర్వీసు ఏర్పాటు చేశారు. ఇటీవల నగరిలో జరిగిన ప్రజాదర్బార్‌లో ఆ గ్రామస్థులు ఈ సమస్యను.. ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన చొరవతో బస్సు ఏర్పాటైంది. గురువారం సత్యవేడు డిపో నుంచి అధికారులు, మల్లారెడ్డికండ్రిగ గ్రామస్థుల సమక్షంలో బస్సు ప్రారంభించారు. గ్రామస్థులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

నూతన కార్యవర్గ ఎన్నిక



చెన్నకేశవరెడ్డి పురుషోత్తం

జీడీనెల్లూరు: మండల పీఆర్టీయూ అధ్యక్షుడిగా చెన్నకేశవరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పురుషోత్తం ఏకగ్రీవంగా గురువారం ఎన్నికయ్యారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు చలపతి, జిల్లా ఉపాధ్యక్షులు దినకర్, జిల్లా కౌన్సిలర్ చంద్రశేఖర్‌శెట్టి, జిల్లా కార్యదర్శి దేవేంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో మండల గౌరవాధ్యక్షుడిగా గంగాధరం, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా రాజేంద్రరెడ్డి, విజయ్‌కుమార్, ఆర్.మోహన్‌రెడ్డి, డి.మోహన్‌రెడ్డి, పవన్‌కుమార్, కిరణ్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అన్ని విధాలా ఆదుకుంటాం

పాలసముద్రం, న్యూస్‌టుడే: రుణ దాతల వేధింపులకు గురై మృత చెందిన ఎంపీటీసీ జగన్నాథరాజు కుటుంబాన్ని అన్ని విధాలుగా పార్టీ ఆదుకుంటుందని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు పేర్కొన్నారు. నరసింహాపురం తెదేపా ఎంపీటీసీ జగన్నాథరాజు మంగళవారం కిడ్నాప్‌కు గురై ఏలూరు జిల్లా నూజివీడులో శవమై తేలిన విషయం తెలిసిందే. గురువారం మృతదేహం గ్రామానికి చేరింది. టీవీఎన్‌ఆర్‌పురంలో ఎంపీటీసీ భౌతికాయంపై పార్టీ జెండా కప్పి పూలమాలలు వేశారు. విదేశీ పర్యటనలో ఉండటంతో బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే డాక్టర్ థామస్ చరవాణి ద్వారా కుటుంబానికి ధైర్యం కల్పించి సంతాపం వ్యక్తం చేసి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు సీ.ఆర్ రాజన్ ఆదేశాల మేరకు జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, మోహన్‌రాజు మట్టి ఖర్చులకు రూ.5వేలు అందించారు. నాయకులు శేఖర్‌రాజు, మాజీ ఎంపీపీ మీనా మోహన్, అరుల్‌నాథన్, సాంబశివం, ఇందిరమ్మ, తంగరాజ్, రవినాయుడు పాల్గొన్నారు.

కుష్ఠు నిర్మూలనకు సహకరించండి.. విజయపురం: కుష్ఠు నిర్మూలనకు సహకరించాలని లెప్రసీ డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ కానిక్ రాజు కోరారు. గురువారం శ్రీహరిపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో కుష్ఠు నివారణకు అవగాహన సమావేశం నిర్వహించారు.

బోర్‌వెల్ తవ్వకం.. జీడీనెల్లూరు: తూగుండ్రం హైస్కూలు ఆవరణలో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు నిధులచే గురువారం తెదేపా నేతలు బోరు తవ్వకం చేపట్టారు. విద్యార్థుల దాహార్తి తీర్చాలని తెదేపానేతల విజ్ఞప్తి మేరకు ఎంపీ ప్రసాదరావు రూ.అయిదు లక్షల విడుదల చేయించి బోరు తవ్వించారు.

స్వరోత్సవాలకు సిద్ధం కండి.. యాదమరి: యు.టి.ఎఫ్ స్వరోత్సవాలకు సిద్ధం కావాలని రాష్ట్ర కార్యదర్శి రమణ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎంపీపీ పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులతో కలిసి పతాకావిష్కరణ చేశారు.

అవగాహన పెంచాలి.. జీడీనెల్లూరు: సేంద్రీయ వ్యవసాయ ఆవశ్యకతపై రైతుల్లో అవగాహన పెంచాలని గుంటూరు నుంచి విచ్చేసిన ఏపీఎస్‌వోపీసీఏ పర్యవేక్షకులు సునీల్‌కుమార్‌రెడ్డి వ్యవసాయాదికారులను కోరారు. గురువారం ఆయన స్థానిక ఆత్మ కార్యాలయంలో వారితో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఏడీఏ సౌభాగ్యలక్ష్మి, ఏవోలు భవానీ, నర్మద, డిల్లీప్రసాద్, ఎఫ్‌పీవో సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పీఆర్టీయూ పోరాటం.. జీడీనెల్లూరు: ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పీఆర్టీయూ ప్రభుత్వంతో పోరాటం చేస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రకాష్‌రెడ్డి, కన్నన్ అన్నారు. గురువారం వారు పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిసి పీఆర్టీయూ సభ్యత్వం తీసుకున్నారు. రాష్ట్ర, జిల్లా నేతలు చలపతి, కనకాచారి, దినకర్, చెన్నకేశవరెడ్డి, మురగేశ్, గంగాధరం, పవన్, నరేంద్రరెడ్డి, శంకర్, మోహన్ పాల్గొన్నారు.

క్వారీలకు అనుమతులు ఇవ్వకండి.. నగరి: వీకేఆర్‌పురం సమీపంలో క్వారీలు, క్రషర్లకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వద్దొని గ్రామస్థులు.. ఆర్‌డీఓ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన గ్రామసభలో అభ్యంతరం తెలిపి వినతి అందజేశారు. తహసీల్దార్ రవికుమార్, ఇన్‌ఛార్జి ఎంపీడీవో సతీష్ పాల్గొన్నారు.

నీటి విడుదల.. పెనుమూరు: గంగుపల్లె చెరువుకు ఎన్టీఆర్ జలాశయం పైభాగంలో ఉన్న క్లస్టర్ గేటును తెరిచి మాజీ ఎంపీపీ హరిబాబు నాయుడు నీటిని అనుసంధానం కాలువలోకి విడుదల చేశారు. ప్రతాప్, లోకేష్ పాల్గొన్నారు.

పల్లెల పరిశుభ్రత బాధ్యత కార్యదర్శులదే



పార్వతి

పూతలపట్టు: గ్రామాల పరిశుభ్రత బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందని డీపీవో పార్వతి స్పష్టం చేశారు. ఆమె గురువారం పి.కొత్తకోటలో చెత్త నుంచి సంపద కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి ఆపై ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి విలేకర్లతో మాట్లాడారు. ఫిబ్రవరిలోగా ఇంటిపన్ను వసూలు వంద శాతం పూర్తిచేయాలన్నారు. పలు గ్రామాల్లో పగలు విద్యుత్తు దీపాలు వెలుగుతున్నాయనే ఫిర్యాదులు ఉన్నాయని, అనవసర వ్యయాన్ని తగ్గించాలని కార్యదర్శులకు సూచించామన్నారు. ఎంపీడీవో నాగరాజు, ఈవోపీఆర్డీ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. పి.కొత్తకోట చెత్త సంపద కేంద్రం తనిఖీలో ఆమె వెంట సర్పంచి పద్మరాణి, పంచాయతీ కార్యదర్శి డిల్లీబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించాలి

చిత్తూరు(వైద్యవిభాగం): ప్రజలందరూ క్యాన్సర్ గురించి అవగాహన కలిగి ఉండి.. ప్రారంభ దశలోనే గుర్తించి.. ఆరోగ్యంగా ఉండాలని అపోలో ఆస్పత్రి సూపరింటెండెంట్ రంగనాథ్ తెలిపారు. చిత్తూరు ప్రభుత్వ, అపోలో ఆస్పత్రిలో గురువారం అపోలో విశ్వ విద్యాలయంలోని బయోమెడికల్ సైన్స్ విభాగం విద్యార్థులు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్యాన్సర్ గురించి పూర్తిస్థాయిలో అవగాహన కలిగిఉండి, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆపై ఆస్పత్రిలో క్యాన్సర్ నివారణపై విద్యార్థులు నాటకం ప్రదర్శించి అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు గాంధీ విగ్రహ కూడలి వరకు ప్లకార్డులు చేబూని ర్యాలీగా వెళ్లారు. వైద్యులు కళ్యాణి, శ్రీరూప్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

బంధాలను కాలరాస్తున్న జగన్

చిత్తూరు(జిల్లా పంచాయతీ): తల్లి, చెల్లి బంధాన్ని వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి కాలరాస్తున్నాడని చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ తెదేపా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, జిల్లా కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్ ఆరోపించారు. గురువారం స్థానిక తెదేపా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇలాంటి వ్యక్తి గత ఐదేళ్లుగా రాష్ట్రాన్ని పాలించడం ప్రజల దౌర్భాగ్యమన్నారు. నాయకులు జాఫర్, సురేష్ పాల్గొన్నారు. ❖ మహిళల భద్రత గురించి మాట్లాడే అర్హత జగన్‌రెడ్డికి లేదని తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెదేపా కూటమి ప్రభుత్వం మహిళల భద్రత, రక్షణకు కట్టుబడి ఉందని, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తోందని స్పష్టం చేశారు.

కత్తిపట్టి.. పతకం సాధించి

రాణిస్తున్న పూతలపట్టు విద్యార్థులు

పూతలపట్టు, న్యూస్‌టుడే: పాఠశాల స్థాయి నుంచి జోనల్, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని విద్యార్థులు సత్తా చాటుతున్నారు.. ఆటల పోటీల్లో తమ విద్యార్థులు పాల్గొని, రాణించేలా వ్యాయామ ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తుండటంతో వారు రాటుతేలుతున్నారు.. కత్తిసాము క్రీడలో పూతలపట్టు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటుతున్నారు.

గాయాలకు వెరవక..



మండలంలోని రంగంపేటకు చెందిన శైలజ, ఏకాంబరం కుమారుడు లోహిత్ పదో తరగతి చదువుతున్నాడు.. పేద కుటుంబమైనా తమ పిల్లలు బాగా చదువుకుని మంచి ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో ప్రోత్సహిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు పిల్లలకు తెలియనీయకుండా చదివిస్తున్నారు. కర్నూలులో నిర్వహించిన కత్తిసాము రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. జాతీయ స్థాయి లేజర్ రన్ పోటీలు మహారాష్ట్రలో నిర్వహించగా అందులో తన ప్రతిభ చూపాడు. కత్తిసాము నేర్చుకునే సమయంలో పలుసార్లు గాయాలైనా పట్టించుకోకుండా సాధన చేశాడు. జాతీయ స్థాయిలో పతకం సాధించాలన్నదే లక్ష్యంగా శిక్షణ పొందుతున్నాడు.

విజయంలో కీలకం..



బాలాజీ పదో తరగతి చదువుతున్నారు. తల్లిదండ్రులు సరస్వతి, చంద్రబాబు. మధ్యతరగతి కుటుంబం. కుమారుడు బాగా చదివి మంచి మార్కులు సాధిస్తుండటంతో పాటు క్రీడల్లో సత్తా చాటుతున్నాడని గుర్తించి చక్కగా ప్రోత్సహించారు. జిల్లా పోటీల్లో బాగా రాణించి అంతర జిల్లాల పోటీలకు ఎంపికై జట్టు గెలుపులో కీలక భూమిక పోషిస్తున్నాడు. అండర్-17 కత్తిసాము రాష్ట్ర స్థాయి పోటీలు నంద్యాలలో నిర్వహించగా చక్కటి ప్రతిభ కనబరిచి పతకం సాధించాడు. అథ్లెటిక్స్‌లోనూ చక్కగా రాణిస్తున్నాడు. బాగా చదివి ఐఏఎస్ కావాలన్నదే తన లక్ష్యమని చెప్పాడు.

రేషన్ బియ్యం స్వాధీనం

జీడీనెల్లూరు: అంబోధరపల్లె మలుపు వద్ద అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న చిత్తూరు నగరం సంతపేటకు చెందిన బాలాజీ, సుమతి, కొత్తవెంకటాపురానికి చెందిన కరుణాకర్‌ని అరెస్టు చేశామని ఎన్‌ఆర్‌పేట పోలీస్‌స్టేషన్ ఎస్సై వెంకటసుబ్బమ్మ తెలిపారు. వీరి నుంచి 625 కిలోల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు ఆమె చెప్పారు.

బెంగళూరులో మృతిచెందిన యువకుడికి అంత్యక్రియలు



తులసిరెడ్డి (పాత చిత్రం)

జీడీనెల్లూరు: బెంగళూరులో నిర్మాణంలో ఉన్న భవనం కూలిన దుర్ఘటనలో మృతిచెందిన జీడీనెల్లూరు మండలం విజంపంచాయతీ క్రిష్ణంపల్లెకు చెందిన తులసిరెడ్డి(26)కి గురువారం రాత్రి స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. మూడేళ్ల క్రితం వివాహమైన అతడికి భార్య సావిత్రి, కుమారుడు చేతన్ ఉన్నారు. మృతదేహానికి బుధవారం శవపరీక్షలు పూర్తిచేసి గురువారం స్వగ్రామమైన క్రిష్ణంపల్లెకు తీసుకొచ్చి, అశ్రునయనాల మధ్య అంత్యక్రియలను కుటుంబీకులు నిర్వహించారు.

సత్వర పరిష్కారం అవసరం.. పాలసముద్రం: గత ప్రభుత్వంలో నిర్వహించిన రీ సర్వే లోపాలపై ప్రజల నుంచి స్వీకరిస్తున్న భూమల సమస్యలపై సత్వర పరిష్కారమే ధ్యేయంగా గ్రామసభ నిర్వహిస్తున్నట్లు జిల్లా సర్వే సహాయ సంచాలకులు జయరాజ్, తహసీల్దార్ అరుణకుమారి పేర్కొన్నారు. గురువారం బాలకృష్ణాపురంలో రీసర్వే లోపాలపై అర్జీలు స్వీకరించారు.

ఫిర్యాదు.. విజయపురం: పంచాయతీ కార్యదర్శి, సర్పంచి కలిసి పంచాయతీ బిల్లులు దుర్వినియోగం చేస్తున్నారని గంగమాంబాపురం పంచాయతీ వార్డు సభ్యులు ఎంపీడీవో రమణప్రకాష్‌కు ఫిర్యాదు చేశారు.

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో ప్రతిభ



ఐరాల: ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఐరాల, న్యూస్‌టుడే: నంద్యాల డీఎస్ఏ స్టేడియంలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-17 ఫెన్సింగ్ పోటీల్లో ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు సాబర్ విభాగంలో మహేష్, రోహిత్, ఈపీఈఈ విభాగంలో రంజిత్‌కుమార్ కాంస్య పతకాలు సాధించారని హెచ్ఎం కోమల గురువారం తెలిపారు. వీరిని ఫెన్సింగ్ కోచ్ రాఘవ కార్తీక్, ఎస్ఎంసీ ఛైర్మన్ మహబూబ్‌బాష అభినందించారు. పీడీ దేవా పాల్గొన్నారు. **నింద్ర, న్యూస్‌టుడే:** స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని మోనిషా ఏకాంబరకుప్పంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అండర్-14 విభాగంలో రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ క్రీడలకు ఎంపికైందని ప్రధానోపాధ్యాయుడు శివయ్య తెలిపారు. పీడీ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు అభినందించారు. **పుత్తూరు, న్యూస్‌టుడే:** గొల్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఏడుగురు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయురాలు భారతి తెలిపారు. పూతలపట్టులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14 హ్యాండ్‌బాల్ పోటీల్లో అమృత(9వ తరగతి) ఎంపికైందన్నారు. నగరిలోని ఏకాంబరకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్-14 నెట్‌బాల్ పోటీల్లో బాలుర విభాగంలో లక్ష్మీనారాయణ, రేవంత్, లవకుమార్, బాలికల విభాగంలో యస్మిత, పవిత్ర, జనని ఎంపికయ్యారన్నారు. విశాఖపట్నంలో నవంబరు 9, 10, 11 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని పీడీ గోపీకృష్ణ తెలిపారు. వీరిని హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.



నింద్ర: మోనిషాతో పీడీ సుబ్రహ్మణ్యం



పుత్తూరు: రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయురాలు భారతి, వ్యాయామ ఉపాధ్యాయుడు గోపీకృష్ణ

పలమనేరు

•పలమనేరు • కుప్పం •పుంగనూరు



వానొస్తే వీధులు బురదమయం

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: మండలంలోని కమ్మనపల్లె గ్రామంలో వానొస్తే వీధులు బురదమయంగా మారుతున్నాయి. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే రొచ్చుగా మారిన వీధుల్లో కాలుమోపాల్సిందే. వీధుల్లో సిమెంటు రోడ్లు నిర్మించాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకపోయిందని ప్రజలు వాపోతున్నారు. వర్షం వస్తే పిల్లలు, వృద్ధులు బురదతో నిండిన వీధుల్లో వెళ్లడానికి అగచాట్లు పడుతున్నామని చెప్పారు.

విద్యార్థులకు అసౌకర్యం కలగకూడదు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కుప్పం జూనియర్ సివిల్ కోర్టు జడ్జి, కుప్పం న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్ ఆరిఫా షేక్ అన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం, వసతులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాల్లో ఎలాంటి లోపాలు ఉండకుండా జాగ్రత్త వహించాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న జూనియర్ సివిల్ జడ్జి ఆరీఫా షేక్



బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అమర్

పూర్వవైభవం తీసుకురావడానికి యత్నిస్తా

పలమనేరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలోనే గుర్తింపు పొందిన పలమనేరు ఆర్టీసీ డిపోకు పూర్వవైభవం తీసుకురావడానికి ప్రయత్నిస్తానని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. గురువారం ఆయన డిపో ఆవరణలో ఏడు కొత్త బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత అతి తక్కువ కాలంలోనే ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని అన్నారు. గత ప్రభుత్వ కాలంలో ఇక్కడి బస్సులను ఇతర డిపోలకు తరలించిన విషయాన్ని గుర్తు చేశారు. భవిష్యత్తులో డిపోకు మరో 9 సర్వీసులు రానున్నాయని వివరించారు. గత పాలకులు డిపోను పూర్తిగా నిర్వీర్యం చేశారని దాంతో ప్రయాణికులు బస్సులు లేక ఇబ్బందులు పడ్డారని అన్నారు. ఈ సందర్భంగా పలమనేరు పరిరక్షణ సమితి సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో డిపో మేనేజరు టికెస్వామి, పలమనేరు కోఆపరేటివ్ సూపర్‌బజార్ అధ్యక్షులు ఆర్వీబాలాజీ, తెదేపా నాయకులు ఆర్బీసీకుట్టి, గిరిబాబు, నాగరాజు, ఖాజా, శ్రీధర్, చిన్ని, బిఆర్సీకుమార్ పాల్గొన్నారు.



ప్రహరీ నిర్మాణానికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

కుప్పాన్ని ఆదర్శ పురపాలికగా తీర్చిదిద్దుతాం

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: కుప్పం పురపాలికను ఆదర్శ పురపాలికగా మార్చడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని, అందుకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఎమ్మెల్సీ శ్రీకాంత్ తెలిపారు. పురపాలిక పరిధిలోని 9వ వార్డులో మంచినీటి ట్యాంకు ప్రహరీ నిర్మాణానికి గురువారం ఆయన భూమి పూజ చేసి మాట్లాడారు. అమరావతి కాలనీలో నెలకొన్న ప్రతి సమస్యను పరిష్కరించి, కాలనీని ఆదర్శంగా నిలుపుతామన్నారు. పురపాలికలో అన్ని వసతులు, అభివృద్ధి కార్యక్రమాలకు రూ.450 కోట్లతో ప్రతిపాదనలు కడా ద్వారా పంపినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాయిలహరి, పురపాలిక కమిషనర్ శ్రీనివాసరావు, తెదేపా మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, జనసేన కన్వీనర్ నరేష్, నాయకులు వెంకటేష్, సత్యేంద్రశేఖర, వేలు, మణి, గని పాల్గొన్నారు.

పీఈఎస్‌లో ఘనంగా వైట్‌కోట్ దినోత్సవం

కుప్పం, న్యూస్‌టుడే: స్థానిక పీఈఎస్ వైద్య కళాశాలలో వైట్‌కోట్ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ క్రిష్టారావు ప్రసంగిస్తూ.. అనాటమీ విభాగంలో అధ్యయనం పట్ల వైద్య విద్యార్థులు నిబద్ధతను కలిగి ఉండాలని సూచించారు. వైద్య విద్య, పరిశోధనలు, సేవల్లో నైతికత అత్యంత ముఖ్యమన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని తెలిపారు. మరణించిన వారి శరీర భాగాలు వైద్య పరిశోధనల్లో కీలకమన్న విషయాన్ని మరువరాదన్నారు. ఎంబీబీఎస్ మొదటి ఏడాది విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఎన్‌కే సుబ్రహ్మణ్యం, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ప్రిన్సిపల్ క్రిష్టారావు, వైద్య విద్యార్థులు



పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

జాతీయస్థాయిలో కంగుంది విద్యార్థుల ప్రతిభ

కుప్పం గ్రామీణ : రంగోత్సవ్ వేడుకలు-2024 కార్యక్రమంలో భాగంగా ఆన్‌లైన్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ఎం.పల్లవి, ఎం.అశ్విని, యశ్వంత్‌కుమార్, ప్రేమ్‌కుమార్, సురేంద్ర బంగారు పతకాలు, పవిత్ర, భరత్, ధనలక్ష్మి, దినేష్ వెండి పతకాలు సాధించారు. దినేష్, పావని, కీర్తనకుమారి కాంస్య పతకాలను సొంతం చేసుకున్నట్లు ప్రధానోపాధ్యాయులు సుచరిత ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు చందం విద్యార్థులు.. కుప్పం గ్రామీణం: నగరి మండలం ఏకాంబరకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన జిల్లా స్థాయి నెట్ బాల్ పోటీల్లో కుప్పం మండలం చందం-కొత్తయిండ్లు జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న జి.రమ్య, రంజిత ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ లోకనాథం తెలిపారు. విద్యార్థినులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.



ఎంపికైన విద్యార్థినులతో పీడీ లోకనాథం



కుప్పం: ఏరియా ఆస్పత్రి మార్గంలో వెలగని వీధిదీపాలు

వీధి దీపాలు వెలిగేనా?

- చీకట్లు తొలగేనా
- అసౌకర్యాల్లో ప్రజలు

పుంగనూరు, పలమనేరు, కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: ప్రజల నుంచి పన్నులు వసూలు చేయడంలో ఉన్న బాధ్యత కంటే ప్రజలకు సకాలంలో సేవలు అందించడంలో రెట్టింపు బాధ్యత ఉంది. ఐతే పుంగనూరు, పలమనేరు, కుప్పం పురపాలక పరిధిలో విద్యుత్తు తీగలు ఒక్కో స్తంభం వద్ద కుప్పలు, కుప్పలుగా ఉండడం, వీధుల్లో చెట్లు పెరగడం, తీగలు సక్రమంగా లేకపోవడంతో వీధిదీపాలు సక్రమంగా వెలగడం లేదు. గతంలో ఉన్న ట్యూబ్ లైట్లు, మెర్క్యురీ, హైమాస్ట్ లైట్ల స్థానంలో ఎల్ఈడీ లైట్లను అమర్చి విద్యుత్తు ఛార్జీల భారం తగ్గించుకున్నారు. వాటి నిర్వహణలో అలసత్వం నెలకొంది. చిన్నపాటి చినుకులు పడినా, గాలులు వీచినా వీధిదీపాలు వెలగని పరిస్థితి. వర్షాలతో సెన్సార్లు, స్విచ్‌లు పనిచేయకపోవడంతో వీధిదీపాలు సక్రమంగా వెలగడం లేదు. ఏకాలంలోనైనా విద్యుత్తు దీపాలు అత్యవసరం. విస్తరణ ప్రాంతాల్లో సకాలంలో వీధిదీపాలు అమర్చడం లేదని ప్రజలు వాపోతున్నారు. పుంగనూరు, పలమనేరు, కుప్పం పురపాలికల్లో వీధి దీపాల నిర్వహణలో కదలిక రావాల్సి ఉంది.

● పుంగనూరు పురపాలక పరిధిలోని నక్కబండలో పాతిక శాతం వీధుల్లో వీధి దీపాలు లేవు. భగత్ సింగ్ కాలనీ, పెద్దిరెడ్డి కాలనీల్లో ఇటీవలే 60 వీధి దీపాలు ఏర్పాటు చేశారు. కానీ విస్తరణ ప్రాంతాలు కావడంతో సమస్య ఉత్పన్నమవుతోంది.

● పలమనేరు పురపాలక పరిధిలో ముంబై- చెన్నై జాతీయ రహదారిలో పలు చోట్ల వీధిదీపాలు మరమ్మతుకు గురయ్యాయి. పెద్దచెరువు కట్ట, నాగమంగళం, గంటావూరు కాలనీ, కిట్టన్న మిషన్ రోడ్డు మార్గంలో అదనపు వీధిదీపాలు ఏర్పాటు చేయాల్సివుంది.

● కుప్పం పట్టణంలో వీధిదీపాలు పూర్తి స్థాయిలో లేవు. ఉన్న వాటిల్లో కొన్ని వెలగడం లేదు. ముఖ్యంగా ఏరియా ఆస్పత్రికి వెళ్లే మార్గంలో వీధిదీపాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. కాలనీ విస్తరణ ప్రాంతాల్లోనూ వీధి దీపాల సమస్య ఎక్కువగా ఉంది.



పుంగనూరు: తరచూ వీధిదీపాల మరమ్మతుకు గురయ్యే పెద్దిరెడ్డి కాలనీ



పలమనేరు: పెద్ద చెరువు కట్టపై వెలగని వీధిదీపం

24 గంటల్లో మరమ్మతులు

పట్టణంలో ఎక్కడ వీధిదీపాలు మరమ్మతుకు గురైతే 24 గంటల్లో మరమ్మతులు చేస్తున్నాం. సమస్య ఎక్కువగా ఉంటే కొత్త లైట్లు తెప్పించి అమర్చుతున్నాం. పట్టణంలో ఎక్కడైనా వీధిదీపాలు మరమ్మతుకు గురైతే అధికారుల దృష్టికి తీసుకురావచ్చు.

- మధుసూదనరెడ్డి(పుంగనూరు), రమణారెడ్డి(పలమనేరు), శ్రీనివాసరావు(కుప్పం), పురపాలక కమిషనర్లు



బహుమతులు అందుకున్న విద్యార్థులు



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

పోటీ పడ్డారు.. ప్రతిభ చాటారు

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు ఈనాడు ప్రతిభా పోటీలో చురుగ్గా పాల్గొన్నారు. గురువారం 8,9,10 తరగతులకు చెందిన విద్యార్థులు ఇంటర్నెట్ వలన లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం అనే అంశాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో భాగస్వాములయ్యారు. పోటీలో పదో తరగతికి విద్యార్థిని భావన ప్రథమ, 8వ తరగతికి చెందిన నందిని ద్వితీయ, 7వ తరగతికి చెందిన ఉమశ్రీ తృతీయ స్థానాలు పొందారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని లత బహుమతులు, ప్రసంశాపత్రాలను అందించారు.

'అధికారులు న్యాయం చేయాలి'

చౌడేపల్లె, న్యూస్‌టుడే: అధికారికంగా టెండరు దక్కించుకున్నా తరిమేశారని.. అధికారులు స్పందించి న్యాయం చేయాలని మండలంలోని కొలింపల్లెకు చెందిన గంగిరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. 'బోయకొండ దేవస్థానం ఈ ఏడాది ఫిబ్రవరి 3న నిర్వహించిన టెండర్లలో కూల్‌డ్రింక్, క్యాంటీన్ నిర్వహణ, కొండ కింద చికెన్ దుకాణ ఏర్పాటు హక్కులను ఏడాది పాటు కాలపరిమితికి పొందా. నెల రోజులు మాత్రమే వ్యాపారం నిర్వహించగా.. స్థానిక నాయకులు దౌర్జన్యం చేసి దుకాణం నిర్వహించకుండా అడ్డుకున్నారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం డిపాజిట్ డబ్బులు ఇవ్వాలని అడిగినా స్పందించడం లేదన్నారు.

అవీ.. ఇవీ.. అన్నీ..

నామినేటెడ్ పోస్టులు కల్పించడం హర్షం.. కుప్పం పట్టణం : రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో నాయి బ్రాహ్మణులకు నామినేటెడ్ పోస్టులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేయడం హర్షనీయమని నాయిబ్రాహ్మణ సంఘ నాయకుడు శాంతారామ్ హర్షం తెలిపారు. తమ కులస్థులను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయానికి తాము ఎప్పటికీ రుణపడి ఉంటామన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం.. పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 26న మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లీలామాధవి తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం.. శాంతిపురం: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఐదో విడత కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు ఈనెల 26 (శనివారం) లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ నగేష్ ప్రకటనలో కోరారు. 27న విద్యార్హత ధ్రువ పత్రాల పరిశీలన, 28న కౌన్సెలింగ్ జరుగుతుందని తెలిపారు.

సమయ పాలనకు ప్రాధాన్యం.. పుంగనూరు: విద్యార్థులకు భజన, ఆరోగ్యం కోసం సమయ పాలనకు ప్రాధాన్యత ఇవ్వాలని శ్రీసత్యసాయి సేవాసంస్థల జిల్లా అధ్యక్షుడు మధుసూదనం అన్నారు. గురువారం స్థానిక కొత్తఇండ్లులో బాలవికాస్ కేంద్రంలో గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఆరోగ్యం కోసం పాటించాల్సిన నియమాలు, మైండ్ గేమ్స్ తెలిపే గోడపత్రికలను ఆవిష్కరించారు. బాలవికాస్ జిల్లా సయుంక్త సమన్వయకర్త హేమలత, గురువులు పావని, దేవరాజులు పాల్గొన్నారు.

అధికారులను భయపెట్టి అభివృద్ధిని అడ్డుకోకండి.. పలమనేరు : మండలంలోని వైకాపా నేతలు అధికారులను భయపెట్టి అభివృద్ధిని అడ్డుకోడానికి ప్రయత్నిస్తే ఊరుకోమని తెదేపా నాయకులు హెచ్చరించారు. గురువారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కొలమాసనపల్లె ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మినారాయణ, మండల తెదేపా అధ్యక్షులు నాగరాజురెడ్డి మాట్లాడుతూ వైకాపా నాయకులు ఇటీవల ఎంపీపీని అడ్డుపెట్టుకుని ఎంపీడీవో ఖాదర్‌బాషాపై దురుసుగా ప్రవర్తించడాన్ని ఖండించారు. ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అభివృద్ధి చేస్తుంటే అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. తెదేపా నాయకులు పాల్గొన్నారు.

133 మందికి నలుగురే ఉపాధ్యాయులు.. బైరెడ్డిపల్లె: నెల్లిపట్ల ప్రాథమిక పాఠశాలలో 133 మంది విద్యార్థులు చదువుతున్నారు. గతంలో ఇక్కడ ఐదుగురు ఉపాధ్యాయులు విద్యా బోధన చేసేవారు. ఇక్కడ పనిచేస్తున్న ఓ టీచర్‌ను అధికారులు డిప్యుటేషన్‌పై వేరే పాఠశాలకు బదిలీ చేశారు. విద్యాశాఖ నిబంధనల ప్రకారం బడిలో ఐదుగురు ఉపాధ్యాయులు ఉండాల్సి ఉన్నప్పటికీ ఒకరిని డిప్యుటేషన్ వేయడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

శుద్ధజల కేంద్రం తిరిగి ప్రారంభం.. సోమల, న్యూస్‌టుడే: మండలంలోని ఇరికిపెంటలో శుద్ధజల కేంద్రం మరమ్మతుకు గురికావడంతో కొన్ని రోజులుగా స్థానికులకు నీరు అందడంలేదు. మాజీ సర్పంచి శ్రీనివాసులునాయుడు, స్థానిక జూనియర్ కళాశాల ఛైర్మన్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో శుద్ధజల కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు.

మందకృష్ణ మాదిగ పర్యటనను విజయవంతం చేయండి.. సోమల : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వచ్చే నాలుగో తేదిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణమాదిగ పర్యటించనున్నారని సమష్టి కృషితో పర్యటనను విజయవంతం చేద్దామని రాష్ట్ర నాయకుడు మురళి పేర్కొన్నారు. సోమల పంచాయతీ ఎస్సీకాలనీలో గురువారం జరిగిన సమావేశం ఆయన మాట్లాడారు.

అక్రమంగా నిల్వ చేసిన టపాసులు సీజ్ పలమనేరు : పట్టణంలోని శ్రీపతిరావుస్ట్రీట్‌లో ఉంటున్న రాజేంద్రబాబు ఇంట్లో అక్రమంగా నిలువ చేసిన రూ.42 వేల విలువ చేసే టపాకాయలను గురువారం రాత్రి పోలీసులు సీజ్ చేశారు. గడ్డూరు కాలనీలో గిరిబాబు ఇంట్లో రూ.14 వేల విలువ చేసే టపాకాయలను పట్టుకున్నారు. ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

రక్తదానం చేయండి ప్రాణాలు కాపాడండి

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రాణాపాయస్థితిలో ఉన్నవారికి రక్తం ఇచ్చి ఆదుకోవడానికి రక్తదానం యొక్క ప్రాముఖ్యతను గుర్తించి రక్తదానం చేయాలని డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ శరణ్‌కుమార్ వివరించారు. గురువారం స్థానిక శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అవరణలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో మానవత, శుభారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎంసీవీ డిగ్రీ కళాశాల, రోటరీక్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులు, ప్రతినిధులు, సభ్యులు మొత్తం 52 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో సరస్వతమ్మ, నందీశ్వరయ్య, ఏసీ.నారాయణరెడ్డి, హరి, సుధాకర్‌రెడ్డి, గణేష్, భాస్కర్‌రెడ్డి, త్యాగరాజు, డాక్టర్ విజయకుమారి, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ అధికారులు రాజశేఖర్, సోమరాజు, వైస్‌ప్రిన్సిపల్ శ్రీనివాస్ పట్టణ యువత పాల్గొన్నారు.

నిఘా వ్యవస్థ పటిష్ఠతకు చర్యలు.. శాంతిపురం, న్యూస్‌టుడే: నేరాల నియంత్రణకు సంబంధించి పోలీస్ నిఘా వ్యవస్థ పటిష్టతకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని బస్టాండుకు సమీపంలో పోలీస్ ఔట్ పోస్టు పునఃప్రారంభం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సీసీ కెమెరాల నిఘా కమాండ్ కంట్రోల్ విభాగాన్ని ప్రారంభించారు. డీఎస్పీ పార్థసారథి, గ్రామీణ సీఐ జె.మల్లేష్‌యాదవ్, రాళ్లబూదుగూరు ఎస్సై ఐ.నరేష్, తెదేపా నాయకులు విశ్వనాథనాయుడు, జనార్ధన్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, జయరామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నాగరాజు, రమేష్, అనసూయ, సిబ్బంది పాల్గొన్నారు.



సీసీ కెమెరాల నిఘా కమాండ్ కంట్రోల్ విభాగాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

మల్లప్పకొండను సందర్శించిన ఎస్పీ.. గుడుపల్లె : జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు గురవారం గుడుపల్లె మండలం మల్లప్ప కొండను సందర్శించి స్వామిని దర్శించుకున్నారు. మల్లప్ప కొండకు తరలివచ్చే భక్తులు, పర్యాటకుల పట్ల భద్రత చాలా ముఖ్యమని ఆ దిశగా ఎప్పటికప్పుడు నిఘా ఉండాలని పోలీసులను ఆదేశించారు. కారు రేస్‌ను జెండా ఊపి ప్రారంభించారు. గుడుపల్లె పోలీస్ స్టేషన్‌ను చేరుకుని రికార్డులు పరిశీలించి డీఎస్పీ, పార్థసారథి, సీఐలు జిటి నాయుడు, మల్లేష్‌యాదవ్, ఎస్సై శ్రీనివాసులకు సూచనలు ఇచ్చారు. మూడు రోజులుగా మల్లప్ప కొండ ఘాట్ రోడ్డు మార్గంలో జరిగిన బైక్, కారు రేస్ పోటీలు గురువారం సాయంత్రం ముగిశాయి రేస్‌లో తలపడిన యువకుల్లో బెంగళూరుకు చెందిన రుసబ్ 4.6 కిలోమీటర్ల దూరం ఘాట్ రోడ్డును 3.26 నిమిషాల్లో కారు నడిపి విజేతగా నిలిచారు. డాక్టర్ సురేస్‌బాబు, దయానిధి, టిఎం.బాబు, పిఎంబాబు తదితరులు విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.

వైకాపా పాపం.. శుద్ధజలానికి గ్రహణం

- మరుగున పడిన నీటి పథకాలు
- కూటమి పాలనలో చిగురించిన ఆశలు

కుప్పం, న్యూస్‌టుడే: చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం ప్రజలపై వైకాపా సర్కారు కక్ష సాధింపు పుణ్యమా అని ఎన్టీఆర్ సుజల స్రవంతి తాగునీటి పథకాన్ని నీరు గార్చింది. పదేళ్ల కిందట నియోజకవర్గంలోని ప్రతి కుటుంబానికి శుద్ధజలాన్ని అందించాలన్న ఆశయంతో తెదేపా ప్రభుత్వం రూ.20 కోట్లతో స్థాపించిన తాగునీటి పథకాలను జగన్ పాలనలో మరుగున పడేశారు. ప్రచార ఆర్భాటానికి నీటి శుద్ధి ప్లాంట్‌లు, ట్యాంకులపై జగన్, పెద్దిరెడ్డి ఫొటో స్టిక్కర్లను రూ.20 లక్షలను వృథాగా ఖర్చు చేశారు. తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో శుద్ధజలం పథకంలో కదలికి వచ్చింది.

చంద్రబాబు పాలనలో రూ. 2కే 20 లీటర్ల శుద్ధజలం

శాంతిపురం, కుప్పం, గుడుపల్లె, రామకుప్పం మండలాల్లోని 76 వేల కుటుంబాలకు అందుబాటులోనే శుద్ధజలాన్ని అందించే కార్యక్రమానికి దశాబ్దం కిందట చంద్రబాబు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రతి కుటుంబానికి రూ.2కే 20 లీటర్ల వంతున శుద్ధజలాన్ని అందించే విధంగా రూ.25 కోట్ల వ్యయంతో నిర్మాణాలు చేపట్టారు. నాలుగు మండలాల్లో 16 చోట్ల తాగునీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో బోర్లను తవ్వి నీటి శుద్ధి ప్లాంట్‌లను నెలకొల్పారు. నియోజకవర్గ వ్యాప్తంగా 202 గ్రామాల్లో శుద్ధజలం పంపిణీ ట్యాంకులను ఏర్పాటు చేశారు. ట్యాంకర్ల ద్వారా ట్యాంకులకు నీటి సరఫరాతో ప్రీపెయిడ్ కార్డులను వినియోగించి నీటిని తీసుకునే విధంగా దాదాపు ఐదేళ్ల పాటు శుద్ధ జలం పంపిణీని కొనసాగించారు.



రాళ్లబూదుగూరు వద్ద ఎన్టీఆర్ శుద్ధ జలం ప్లాంట్ మూతపడిన దృశ్యం

వైకాపా పాలనలో మంగళం

జగన్ పాలన వచ్చిన వెంటనే శుద్ధజలం పథకానికి మంగళం పాడేశారు. కొద్ది రోజులు మాత్రమే రూ.5కు 20 లీటర్ల వంతున నీటిని విక్రయిస్తూ.. ప్రీపెయిడ్ కార్డులపై జగన్ చిత్రాన్ని వేసుకున్నారు. ప్లాంట్‌లు, ట్యాంకర్లు, ట్యాంకులపై జగన్, మంత్రి పెద్దిరెడ్డి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఫొటోలు వేశారు. ఆయా గ్రామ పంచాయతీల నిధుల్లో నుంచి రూ.20 లక్షలను స్టిక్కర్ల గుత్తేదారుకు కట్టబెట్టారు. ఏడాది తిరక్కుండానే నీటి పథకాల నిర్వహణను గాలి కొదిలేశారు. దీంతో నీటి శుద్ధి ప్లాంట్లు మూతపడి సామగ్రి తుప్పుపడుతోంది. చాలా చోట్ల ప్లాంట్ జనరేటర్ల విడిభాగాలను మాయం చేశారు. రూ.లక్షల విలువైన పైపులను తీసుకెళ్లిపోయారు. ట్రాక్టర్లు, ట్యాంకులను స్వప్రయోజనాలకు వినియోగించుకున్నారు.



తిమ్మరాజుపల్లె వద్ద శుద్ధజలం ట్యాంకు చుట్టూ పిచ్చి మొక్కలు

కూటమి పాలన రాకతో..

కూటమి పాలన వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబునాయుడి ఆదేశాలతో శుద్ధజలం ప్లాంట్లు, ట్యాంకులు, బోర్ల దుస్థితిని నీటి సరఫరా విభాగం అధికారులు పరిశీలించారు. మరమ్మతులు, తదుపరి నిర్వహణకు రూ.10.36 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపారు. నిధులు మంజూరైన వెంటనే రూ.2కే 20 లీటర్ల శుద్ధజలం పథకాన్ని అందుబాటులోకి తీసుకొస్తామని అధికారులు చెబుతున్నారు. మొదటగా కుప్పం మున్సిపాలిటీ తర్వాత గ్రామీణ మండలాల్లో నీటి పథకాలను వినియోగంలోకి తెస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ పురుషోత్తం తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే

సమస్య: మండలంలోని మీర్జేపల్లె గ్రామంలో మురుగు నీటి కాలువల్లో మురుగు నిలిచి దుర్వాసన వస్తోంది. పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి. **- వెంకటరమణ, మీర్జేపల్లె ఎస్సీ కాలనీ**

సమాధానం: గ్రామంలో కాలువలను శుభ్రం చేసి పారిశుద్ధ్య చర్యలు చేపడుతాం. **- పంచాయతీ అధికారి**

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే

సమస్య: పట్టణం బైపాస్ మార్గంలోని విజలాపురం కూడలిలో ఏర్పాటు చేసిన పచ్చని మొక్కలు నేలకొరిగాయి. దీంతో మొక్కలు కూలిపోవడంతో అవి పనికి రాకుండా పోతాయి. **- యువరాజ్, కుప్పం**

సమాధానం: పరిశీలించి, మొక్కను యథావిధిగా నాటేందుకు చర్యలు తీసుకుంటాం.
- శ్రీనివాసరావు, కుప్పం పురపాలిక కమిషనర్

పుంగనూరు, న్యూస్‌టుడే

సమస్య: పట్టణంలోని మినీ బైపాస్ రోడ్‌లో తాటిమాకులపాళ్యం శ్మశానవాటిక మలుపులో గోతులు ప్రమాదకరంగా ఉన్నాయి. పురపాలక తాగునీటి పైపులైన్ మరమ్మతులకు చేపట్టిన తవ్వకాలతో గోతులు ఏర్పడ్డాయి.
- రామ్మోహన్, మినీ బైపాస్‌రోడ్

సమాధానం: గోతులను పూడ్చి వేయించి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చేస్తాం.
- మధుసూదనరెడ్డి, పురపాలక కమిషనరు, పుంగనూరు.

సమస్య: స్థానిక తాటిమాకులపాళ్యం రోడ్ నుంచి ఆర్టీసీ బస్టాండుకు వచ్చే మార్గంలో దుర్గంధం నెలకొంది. స్థానిక దుకాణదారుల నుంచి వెలువడే వ్యర్థ పదార్థాలను తీసుకొచ్చి పారబోస్తున్నారు. వర్షాలతో దుర్గంధం నెలకుని దుర్వాసన వస్తోంది. **- రమేష్, విద్యార్థి**

సమాధానం: చెత్తను తొలగించి దోమల నివారణకు చర్యలు చేయిస్తాం. **- మధుసూదన్‌రెడ్డి కమిషనర్**

జీడిరేవులవంక వంతెన మరమ్మతు

సోమల, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన సోమల-నంజంపేట మార్గంలో రెండురోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి జీడిరేవుల వంకపై ఉన్న వంతెన దెబ్బతిని 7 పంచాయతీ పరిధిలోని గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. ఈనాడులో ఫొటో కథనం బుధవారం ప్రచురితమైంది. స్పందించిన రభశాఖ ఈఈ శ్రీనివాసులు, సూచనల మేరకు మాజీ ఎంపీటీసీ రమేష్‌నాయుడు గురువారం వంతెన మరమ్మతులు చేయించారు. సాయంత్రం ఆ మార్గంలో వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయి.

స్పందనకు వందనం

గుంతల పూడ్చివేతకు చర్యలు

సోమల : మండల కేంద్రమైన సోమల సచివాలయంలో నంజంపేట మార్గంలో పెద్దగుంతలు ఏర్పడి కొద్దిపాటి వర్షంతో నీరు చేరి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సమస్యతో కూడిన ఫొటో కథనం ఈనాడులో గురువారం వర్షం పడితే తప్పని పాటు అనే శీర్షికతో ప్రచురితమైంది. స్థానిక పంచాయతీ కార్యదర్శి మజహార్, సర్పంచి రాజేశ్వరి గుంతలను మట్టితో పూడ్చి రహదారిని బాగు చేసేందుకు చొరవ తీసుకోవడంలో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పురపాలక కమిషనరు మధుసూదనరెడ్డి

సమర్థంగా పౌరసేవలు అందిద్దాం

పుంగనూరు, న్యూస్‌టుడే: పట్టణ ప్రజలకు అవసరమైన పౌర సేవలను సమర్థంగా అందిద్దామని పురపాలక కమిషనరు మధుసూదనరెడ్డి అన్నారు. గురువారం స్థానిక పురపాలక కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, సచివాలయాల అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పట్టణంలో వీధిదీపాలు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం నిర్వహణతో పాటు ప్రజలకు అందించాల్సిన ధ్రువీకరణ పత్రాలు, ఇతర సేవలను వేగవంతం చేద్దామన్నారు. ఆదాయ వనరులైన పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టిసారించాలని పేర్కొన్నారు. సమావేశంలో డీఈఈ మహేష్, ఏఈ కృష్ణవేణి, టీపీవో జగదీష్‌రెడ్డి, ఆర్ఐ నాగరాజు, సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



ఆడిటర్లతో సమీక్షిస్తున్న ఆర్‌డీడీ గోవిందప్ప

ఆడిట్ అభ్యంతరాలపై చర్యలు తీసుకోండి

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: ప్రభుత్వ శాఖల్లో ఆడిట్ అభ్యంతరాలు రోజురోజుకు పేరుకుపోతున్నాయి. సకాలంలో ఆడిట్ అభ్యంతరాలను పరిష్కరించుకోని పక్షంలో సంబంధిత శాఖలపై ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆడిట్ శాఖ కర్నూలు రీజియన్ డిప్యూటీ డైరెక్టర్ గోవిందప్ప పేర్కొన్నారు. గురువారం స్థానిక జిల్లా ఆడిట్ శాఖ కార్యాలయంలో ఆడిటర్లతో సమీక్షించారు. ఆర్‌డీడీ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా ఆడిట్ నిర్వహించాలన్నారు. ఆడిట్ నిర్వహణలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామపంచాయతీ, నగరపాలక, పురపాలక సంస్థలకు సమకూరే ఆదాయాలు పరిశీలించి అభ్యంతరాల రూపంలో నివేదించాక వాటిని నిర్ణీత రోజుల్లో పరిష్కరించుకోవాలని, జాప్యం వహిస్తే చర్యలకు ఉపక్రమించాలని సూచించారు. సకాలంలో 2023-24 ఆడిట్ ప్రక్రియ పూర్తిచేసి అంతర్జాలంలో నమోదు చేయాలని సూచించారు. జిల్లా ఆడిట్ అధికారి కృష్ణారెడ్డి, ఏఏవోలు, సీనియర్, జూనియర్ ఆడిటర్లు పాల్గొన్నారు.